ఏలూరు **ఉష్ణోగ్రతలు**
గరిష్ఠం : 33.0
కనిష్ఠం : 25.0

చిర్రి X తెల్లం

అవినీతిపై చర్చకు సిద్ధమా

మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ఫైర్



జీలుగుమిల్లి, ఆగస్టు 5: (ఆంధ్రజ్యోతి): పోలవరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. సోషల్ మీడియా వేదికగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై మాజీ ఎమ్మెల్యే తెల్లం అవినీతి ఆరోపణలు గుప్పించారు. మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై చిర్రి బాలరాజు మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విరుచుకుపడ్డారు. తాను ఒక ఏడాదిలో వంద కోట్లు ఆర్జిస్తే పలు దఫాలు ఎమ్మెల్యేగా పనిచేసిన మాజీ ఇంకెంత సంపాదించారో చెప్పాలని నిలదీశారు. ఆయనకు దమ్ము ధైర్యం ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో 20 ఏళ్లుగా కనిపించని అభివృద్ధిని తాను ఎమ్మెల్యేగా ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం ద్వారా చేసి చూపించామన్నారు. ఏజెన్సీ మారుమూల గిరిజన మండలాల్లో ఆదాయ వనరులు తక్కువ అని తెలిసిం దేనన్నారు. తాగునీరు, సరైన గృహాలు, ఇతర అవసరా లు లేక 7 మండలాల గిరిజన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు కేంద్రం ఆధ్వ ర్యంలో నిర్మాణం జరుగుతుందని, స్థానిక ఎమ్మెల్యేగా ప్రాజెక్టుపై పర్యవేక్షణ బాధ్యత తనకు ఉందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే నిక్కరు వేసుకున్నప్పటి నుంచి తెలు సని మాజీ ఎమ్మెల్యే అవాకులు చవాకులు మాట్లాడా రని, నిక్కరు వేసుకున్న ఎమ్మెల్యే నిన్ను ఓడించిన సంగతి గుర్తెరగాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చురక లంటించారు. మాజీ, సిట్టింగ్ ఎమ్మెల్యే ఒకరిపై ఒకరు విమర్శలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

పెయ్యేరు పంచాయతీ అవకతవకలపై 13న విచారణ

ముదినేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగం, పరిపాలనపరమైన అంశాల్లో చోటు చేసుకున్న అవకతవకలపై ఈ నెల 13న విచారణ జరుగనుంది. కలెక్టర్ వెట్రి సెల్వీ ఆదేశాల మేరకు డీపీవో కొడాలి అనూరాధ విచారణకు ఉత్తర్వులు జారీ చేశారు. విచారణాధికారి, ఏలూరు డీఎల్‌పీవో లక్ష్మి విచారణ చేపడతారు. 13న విచారణకు సర్పంచ్, పం చాయతీ కార్యదర్శి రికార్డులతో సహా హాజరు కావాలని విచారణాధికారి మంగళవారం నోటీసులు జారీ చేశా రు. ఫిర్యాదిదారు దూబా చంద్రకాంత్ కూడ ఆరోపణ లపై తగిన ఆధారాలతో హాజరు కావాలన్నారు. గతం లో జరిగిన విచారణలో పంచాయతీ నిధులు రూ. 37.50 లక్షలు దుర్వినియోగం జరిగినట్లు అధికారులు ధ్రువీకరించారు. తాజాగా 2021-22 నుంచి 2023-24 నిధుల వినియోగంపై విచారణ జరుగనుంది.

పేదరికం పారిపోవాలి

పీ-4 లక్ష్యాలపై దృష్టిసారించిన యంత్రాంగం



పేదరికం లేని సమాజం రావాలి. అంతకంటే మించి పేదరికంలో ఉన్న వారిని పైకి తెచ్చే దయాగుణం ఉన్న వారిని రంగంలోకి దింపాలి. ఈ రెండింటిని అధికార యంత్రాంగం సమన్వయం చేయాలి. వీలైతే ఈ నెల మూడో వారం నుంచే పేదరిక నిర్మూలనకు మహాయజ్ఞం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అనుగుణంగానే పీ-4 పేరిట అటు పేద కుటుంబాలను దత్తత తీసుకునే మార్గదర్శకులను ఎంపిక చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోనే పేదరిక నిర్మూలనలో సుమారు లక్ష కుటుంబాలను లక్ష్యంగా తీసుకుంది. ఎవరిపైన ఒత్తిడి లేకుండా స్వచ్ఛంధంగా ముందుకు వచ్చేవారి కోసం యంత్రాంగం పరుగులు పెడుతోంది. అందరి లక్ష్యం పీ-4.

- **జిల్లాలో 99,905 బంగారు కుటుంబాలు, 6,429 మార్గదర్శుల గుర్తింపు**
- **ఉద్యోగ కల్పన, వైద్య సేవలు, చిన్నపాటి అవసరాలు తీర్చడమే లక్ష్యం**
- **ఈ నెల 19 నుంచి పీ-4 అంకురార్పణ**

(ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తెలుగుదేశం కూటమి అధికారంలోకి వచ్చాక వినూత్న పథకాలకు శ్రీకారం చుట్టింది. సంక్షేమం, అభివృద్ధి సమతూకంలో ఉండేలా జాగ్రత్త పడు తోంది. క్షేత్రస్థాయిలో అన్నింటిని విశ్లేషించిన తదుపరి పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం నడుం బిగించింది. పేదలను దాతల సాయంతో ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా పీ4 కార్యక్రమం రూపొందించింది. పేదరికంలో ఉన్న కుటుం బాలను గుర్తించేందుకు అధికార యంత్రాంగాన్ని రంగంలోకి దింపింది. జిల్లా వ్యాప్తంగా మారుమూల గ్రామాలే కాదు, పట్టణాల్లో దారిద్ర్యరేఖకు అత్యంత దిగువన ఉన్న కుటుంబా లను దాదాపు ఇప్పటికే గుర్తించారు. ఈ కుటుంబాల ను పూర్తిగా ఆదుకునేందుకు, వారి జీవనశైలిలో పెనుమార్పులు తెచ్చేందుకు అనువుగా చకచకా పావులు కదుపుతున్నారు. ఈ తరహా కుటుంబాలను తక్కువ చేయకుండా బంగారు కుటుంబంగా నామ కరణం చేశారు. బంగారు కుటుంబాలను స్వయంశక్తి తో నిలిచేలా జీవం పోస్తారు. ఆయా కుటుంబాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలే కాకుండా, మౌలిక వసతుల కల్పనకు వీలుగా ప్రణాళిక సిద్ధం చేస్తారు.

బంగారు కుటుంబాల గుర్తింపు

ఇప్పటికే జిల్లావ్యాప్తంగా 99వేల మందికిపైగా బంగారు కుటుంబాలను గుర్తించారు. ఆయా కుటుం బాల స్థితిగతులను నమోదు చేస్తున్నారు. ఆయా కుటుంబాలను దత్తత తీసుకునే వారిని మార్గదర్శకు లుగా వ్యవహరిస్తారు. వారే ఆయా కుటుంబాలకు అంతా తామై వ్యవహరిస్తారు. ఈ దిశగా బలమైన అడుగులు వేస్తే పేదరిక నిర్మూలన సాధ్యమని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తగ్గట్టుగానే గడిచిన నాలుగువారాలుగా అధికార యంత్రాంగం యావత్తు తలమునకలై ఉంది.

అధికారులపై ఒత్తిడి..!

ముఖ్యమంత్రే స్వయంగా పేదరిక నిర్మూలనకు వీలుగా పీ-4కు తొలి ప్రాధాన్యత ఇవ్వడంతో ఈ ప్రభావం కాస్త యంత్రాంగంపై ఒత్తిడికి దారితీసింది. పక్కా ప్రణాళిక, నమోదు, ఆచరణ ఒకే వరుసలో ఉండాల్సి రావడంతో క్షేత్రస్థాయి వరకు అధికారులకు సవాల్‌గా మారింది. ఈ క్రమంలోనే గత నెలలో మార్గదర్శకులు కోసం ఉపాధ్యాయులను పూర్తిగా భాగస్వామ్యం చేయాలని డీఈవో ఒక అడుగు ముందుకు వేయడం, ఆ వెంటనే వెనక్కి మళ్లడం

మిగతా 8వ పేజీలో..

పేదరికం నిర్మూలనకు పీ4



ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో సీఎం సమీక్ష

పేదరిక నిర్మూలనకు పీ-4 చేపట్టాం. బంగా రు కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలే లక్ష్యం. మార్గదర్శుల నుంచి చిన్న ఆసరా పేదల కు కొండంత అండ. డబ్బుతో పాటు సాయం చేసేవారు కూడా మార్గదర్శులేనని సీఎం చంద్ర బాబు అన్నారు. ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారు లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం సమీక్షించారు. ఈ నెల 19 నుంచి పీ-4 అమలు చేయాలని నిర్ణయించామన్నారు. బంగా రు కుటుంబాలను ఆదుకోవడంలో మార్గదర్శులు స్వచ్ఛందంగానే సాగాలని, ఎవరినీ బలవంతం చేయవద్దని, వీరి ఎంపికలో ఎక్కడా వ్యతిరేకత రాకూడదని సూచించారు. మానవత్వం ఉన్న వారే ఇందులో చేరతారని సీఎం అన్నారు. ఉద్యో గావకాశాలు, వైద్యం, కుటుంబ అవసరాలు తీర్చేందుకు చిన్న వ్యాపారాలు మార్గదర్శుల ద్వారా సమకూరతాయన్నారు. సమీక్షలో కలెక్టర్ వెట్రిసెల్వి, డీఆర్‌వో వి.విశ్వేశ్వరరావు, సీపీవో వాసుదేవరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, జిల్లా మత్స్యశాఖాధికారి నర్సయ్య, పశుసంవర్థక శాఖ జేడీ గోవిందరాజు, జిల్లా వ్యవసాయాధి కారి హబీబ్ భాషా పాల్గొన్నారు.



సమస్యలపై చర్చించిన ఉద్యోగుల సంఘ ప్రతినిధులు

టీ తాగుతూ.. ఉద్యోగుల డిమాండ్స్

ఏలూరుసిటీ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఎస్‌వి రామకృష్ణారావు, ఏడీఎస్ఆర్ఎం బంగార య్య ఆధ్వర్యంలో 'రండి టీ తాగుతూ మాట్లాడుకుందాం' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నాలుగు డీఏలు, పీఆర్సీ కమిటీ, మధ్యంతర భృతి (ఐఆర్)పై చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం సూచనలు, పరిష్కార మార్గాలు వీడియో ప్రదర్శన ద్వారా వివరించి ఉద్యోగుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా క్యార్యవర్గ సభ్యులు, సిటీ కార్యవర్గ సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టులకు త్వరలో నూతన అక్రిడిటేషన్

ఏలూరు టూటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులకు నూతన అక్రిడిటేషన్లు ప్రభుత్వం త్వరలో మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ వెట్రి సెల్వి తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్ల దినోత్సవం పురస్కరిం చుకుని మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించేం దుకు కృషి చేస్తానన్నారు. నూతన అక్రిడిటేషన్ల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అనంతరం ఐజేయు నాయకులు జీవీఎస్ఎన్. రాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు కేపీకే.కిశోర్ మాట్లాడుతూ కూట మి ప్రభుత్వం జర్నలిస్టులకు త్వరలో అక్రిడిటేషన్లు జారీ చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఏడాది గడిచినా ఇంత వరకు ఇవ్వలేదని మూడుసార్లు అక్రి డిటేషన్లు పొడిగించారన్నారు. అక్రిడిటేషన్ల కమిటీలో జర్నలిస్టుల సంఘాల ప్రాతినిధ్యం ఉండన్నారు. ఆరోగ్య పథకాన్ని ప్రయోజకరంగా మార్చాలన్నా రు. జర్నలిస్టుల ప్రమాద బీమా పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. ఇళ్లస్థ లాలు, పింఛన్ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీయూ డబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి టైమ్స్‌కిషోర్, ఉపాధ్యక్షులు బూర్ల శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా సంఘ అధ్యక్ష కార్యదర్శులు సంజయ్ కుమార్, ఎస్.శ్రీనివాస్, సీహెచ్ రామకృష్ణరాజు, షేక్ రియాజ్, విజయ్ కుమార్, శ్రీధర్, పోతురాజు, బ్రహ్మయ్య, రత్నకుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో ఇష్టారాజ్యం చెల్లదు



బీసీ సంక్షేమ వసతి గృహాల నిర్వహణలో సమూల మార్పు లకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జూలై 1 నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థుల ముఖ ఆధారిత హాజరు (ఫేస్ రికగ్నిషన్) తప్పనిసరి చేశారు. విద్యార్థుల హాజరు ప్రకారం మెనూ తయారీతో ఇష్టారాజ్యంగా వండి వార్చడం, సరకులను దోచుకోవడానికి కుదరదు. ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్, భోజనం, రాత్రి అందించే పండ్ల వరకు ఫోటో తీసి బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారికి పంపుతున్నారు.

- **నిరంతరం అధికారుల తనిఖీ**
- **రెండు పూటలా విద్యార్థుల ముఖ హాజరు**
- **నిత్యం యోగా.. మెనూపై పర్యవేక్షణ**
- **నేటి నుంచి కొత్త విద్యార్థులకు ఫ్రెషర్స్ డే**

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

వసతి గృహాల్లో అధికారుల నిరంతర తనిఖీలతో ఉద్యోగులు, సిబ్బంది పనితీరు మెరుగైంది. జిల్లాలో 33 బీసీ వసతి గృహాలుండగా, 1వ తరగతి నుంచి పీజీ వరకు మొత్తం 2280 మంది విద్యార్థులు బస చేస్తున్నారు. కొన్ని చోట్ల నూతన వాష్‌రూమ్స్ నిర్మాణం, ఇతర మరమ్మతులు పూర్తి చేసి రంగులతో తీర్చిదిద్దారు.

మంత్రులు, అధికారుల ఆరా..

వసతి గృహాల పర్యవేక్షణ సక్రమంగా ఉందా? లేదా, మెనూ ప్రకారం వడ్డన జరుగుతుందా, ఇతర వసతులపై అధికారులు తరచు తనిఖీ చేస్తున్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఫుడ్ కమిషన్ చైర్మన్ మాదిరెడ్డి ప్రతాప్, బీసీ సంక్షేమశాఖ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు ఇటీవల పలు వసతి గృహాలు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతీ నెల జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి ప్రతీ వసతిగృహం తనిఖీ చేస్తున్నారు. ఇద్దరు అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారులు కూడా తనిఖీ చేస్తున్నారు మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు కూడా తమ పరిధిలోని హాస్టల్స్ పరిస్థితులను పరిశీలించి కలెక్టర్‌కు నివేదికలు ఇస్తున్నారు. ప్రతీ ఏటా వసతి గృహాల నిర్వహణకు రూ.80 కోట్లు వెచ్చిస్తున్నట్లు అధికారులు, ప్రజా ప్రతినిధులు చెబుతున్నారు.

కొత్త విద్యార్థులకు ఫ్రెషర్స్ డే..

వసతి గృహాల్లో కొత్తగా చేరిన విద్యార్థులు ఇతరులతో కలిసి ఉండడంపై అవగాహనకు ఈ నెల 6 నుంచి 9 వరకు ఫ్రెషర్స్ డే నిర్వహించనున్నారు. ఈ మేరకు వసతి గృహాల్లో అధికారు లు ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల ఆరోగ్యం మెరుగుదలకు ఉదయం యోగా చేయిస్తున్నారు. స్కూల్ నుంచి నేరుగా హాస్టల్‌కు చేరే విషయంలో సిబ్బంది దగ్గరుండి ఒక క్యూ పద్ధతిలో సురక్షితంగా తమ ప్రాంగణాలకు చేరుకుంటున్నారు.

సేవలు పారదర్శకం

జిల్లాలో 33 వసతి గృహాలు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. రెండు పూటలా వారికి అందించే టిఫిన్, భోజనం, ఇతర స్నాక్స్ వార్డెన్‌లు తనకు తప్పనిసరిగా ఫోటోలు రూపంలో వివరాలను సమర్పిస్తారు. హాస్టల్స్‌లో కొన్ని సౌకర్యాలు కల్పించడానికి దాతలు ముందుకు రావాలి. అందుబాటులో ఉన్న నిధులతో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు సమకూరుస్తున్నాం.

ఆర్‌వీ.నాగరాణి, బీసీ వెల్ఫేర్ అధికారి



ఆర్టీసీ ఆస్తులను ధారాదత్తం చేస్తే ఊరుకోం

ఈయూ రీజనల్ కార్యదర్శి రాంబాబు హెచ్చరిక

పాలిటెక్నిక్ ఫెయిల్ కావడంతో పురుగుల మందు తాగేశాడు

42 రోజులుగా చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

7



కలెక్టరేట్ పరిసరాలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

స్వాతంత్ర్య వేడుకలకు కలెక్టరేట్ ముస్తాబు

ఏలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య వేడుకలకు కలెక్టరేట్ ముస్తా బవుతోంది. కొద్ది రోజులుగా కలెక్టరేట్ ప్రాంగణం బయట, లోపల పిచ్చి మొ క్కలను సిబ్బంది తొలగిస్తున్నారు. ఇటీ వల వర్షాలకు మొక్కలు పెరిగిపోవడంతో దట్టంగా రోడ్డు మార్జిన్లు నిండిపోయాయి. మున్సిపల్ సిబ్బంది ప్రత్యేకంగా కలెక్టరేట్ పరిసరాలను శుభ్రం క్లీన్ చేస్తున్నారు.

జిల్లాలో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఏర్పాట్లు

ఏలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొబైల్ టెలికాం కంపెనీలకు 4 జీ నెట్‌వర్క్ సంబంధించి ఆప్టికల్ ఫైబ ర్ కేబుల్ ఏర్పాటుకు అనుమతులు వెం టనే మంజూరు చేస్తామని కలెక్టర్ కె వెట్రిసెల్వి రాష్ట్ర ఐటీశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్‌కు వివరించారు. టెలికాం కంపెనీల నెట్‌వర్కుల ఏర్పాటు పై సచివాలయం నుంచి భాస్కర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు జిల్లాలో 4 జీ నెట్‌వర్కుల కోసం 7 అనుమతులు రాగా 4 కంపెనీలకు ఇటీవల మంజూరు ఇచ్చా మని, మిగిలిన 3 కంపెనీలకు అనుమతు లు మంజూరు చేస్తామని వివరించారు.

జిల్లాలో సరిపడా యూరియా నిల్వలు

ఏలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలుంచామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడుకు వివరించారు. సచివాలయం నుంచి కలెక్టర్లతో ఆయన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖరీఫ్ సీజన్‌కు అన్ని సహకార సంఘాల్లో, ప్రైవేట్ కంపెనీల్లో కొరత లేకుండా ముందస్తుగానే ఎరువుల నిల్వలు ఉండేలా చూడాలని మంత్రి ఆదేశించారు. దీనిపై కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు 1,18,402 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా ఇప్పటి వరకు 42,456 మెట్రిక్ టన్నులు ఎరువులు ఉంచామన్నారు. రైతుల అవస రాలకు అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

పరేషన్



వీఆర్ పురం నుంచి వాహనంలో తెచ్చిన రేషన్ బియ్యాన్ని దించుకుంటున్న నిర్వాసితులు(ఫైల్)

- **రేషన్ సరుకులు తెచ్చుకోవాలంటే 300 కిలో మీటర్లు వెళ్లాలి**
- **రూ.30 వేల ఖర్చు తప్పదు**
- **బుట్టాయగూడెం పునరావాస కాలనీలో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా నిర్వాసితులు**
- **రెండేళ్లుగా రేషన్ కార్డులు మార్చలేదు!**

బుట్టాయగూడెం మండలం రామన్నగూడెం పునరావాస కాలనీలో ఉంటున్న నిర్వాసితులకు రేషన్ సరుకులు 300 కిలో మీటర్ల దూరం నుంచి తెచ్చుకోవాలి. రెండు వాహనాలకు సుమారు రూ.30 వేలు చెల్లించాలి. మన్యం జిల్లా పోచవరం నిర్వాసితులను ఇక్కడికి తరలించారు. వారి రేషన్ కార్డులు ఇక్కడి బదిలీ కాలేదు. రేషన్ సరుకులు అలాట్‌మెంట్ లేదు. ప్రతి నెల 300 కిలో మీటర్ల దూరం నుంచి రేషన్ తెచ్చుకోవలిసిందే. రెండేళ్లుగా రేషన్ కార్డు సమస్యపై ఎంతమంది అధికారులకు విన్నవించినా పట్టించుకున్న వారే లేరు.

బుట్టాయగూడెం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రేషన్ కష్టాల ను ఎప్పటికి తీరుస్తారని రామన్నగూడెం (పోచవరం) ఆర్ అండ్ ఆర్ కాలనీకి చెందిన నిర్వాసితులు అడుగుతున్నారు. రెండేళ్ల నుంచి రేషన్ సరుకుల కోసం ఇబ్బందులు పడుతు న్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ తెచ్చుకోవాలంటే సుమారు 300 కిలో మీటర్లు వెళ్లాలని, రూ.30 వేలు ఖర్చు చేయాలని గగ్గోలు పెడుతున్నారు. తమ కష్టాలను ఐటీడీఏ అధికారులు, రెవె న్యూ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఆగస్టు నెల రేషన్ బియ్యం ఇస్తున్నా పోచవరం కాలనీ నిర్వాసితులకు పిలుపు రాలేదు.

గత ప్రభుత్వ హయాంలో అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా చింతూరు ఐటీడీఏ పరిధిలోని వీఆర్ పురం మండలం పోచవరం గ్రామానికి చెందిన 160 నిర్వాసిత కుటుంబాలను బుట్టాయగూడెం మండలం నిమ్మలగూడెం, రామన్నగూడెం ప్రాంతాల్లో నిర్మించిన కాలనీలకు తరలించా రు. రెండేళ్ల క్రితం తరలించినా ప్రతినెల రేషన్ బియ్యాన్ని 260 కిలో మీటర్ల దూరంలో పోచవరం వెళ్లి రేషన్ బియ్యాన్ని తెచ్చుకుంటున్నారు. కాలనీలకు నిర్వాసితులను

మిగతా 8వ పేజీలో..

వాహనదారుల భద్రతకు ప్రాధాన్యం

ముదినేపల్లి, మండవల్లి, కైకలూరులో జాతీయ రహదారి విస్తరణ పనులు పరిశీలించిన ఎస్పీ, జేసీ

ముదినేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రహదారి విస్తరణ పనుల నేపథ్యంలో ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సూచించారు. పామర్రు - దిగమర్రు 165 జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భద్రతా చర్యల లోపంతో ఇటీవల ముదినేపల్లి సమీపంలో పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్ లోకి కారు దూసుకుపోయి రిటైర్డ్ సైంటిస్ట్ మృతి చెందారు. సంఘటన జరిగిన ప్రదేశాన్ని మంగళవారం ఎస్పీ, జేసీ పరి శీలించారు. రెండో వంతెన నిర్మాణ ప్రదేశానికి రెండు వైపులా ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకుంటే ప్రమాదం జరిగేది కాద న్నారు. ఇకపై ఎటువంటి ప్రమాదం జరిగినా బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పోల్ రాజ్ డ్రెయిన్ వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవా లని నేషనల్ హైవే ఎస్ఈ, డీఈఈలను ఆదేశించారు. రెవె న్యూ, పోలీస్ అధికారులు కూడా పనులను పరిశీలించాల న్నా రు. అనంతరం పెదపాలపర్రు వద్ద బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని పరిశీలించారు. రహదారి పనులతో ఇబ్బందులు ఎదుర్కొంటు న్నామని ముదినేపల్లి వాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్‌హెచ్ అధికారులపై జేసీ ఆగ్రహం

కైకలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం కారణంగా పలువురు మృతి చెందా రని, ఎవరూ మృతి చెందలేదని ఎన్‌హెచ్ అధికారులు, కాం ట్రాక్టర్ కలిసి అధికారులను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 4న ఆంధ్రజ్యోతిలో 'అధికారుల నిర్లక్ష్యం... ప్రజలకు ప్రాణసంకటం' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించిన జేసీ ధాత్రి రెడ్డి, ఎస్పీ కిశోర్ మంగళవారం లింగాల, పెరికేగూడెం, మండవల్లి గ్రామాల్లో ఎన్‌హెచ్ నిర్మాణ పనులను పరిశీలించారు. మండ వల్లిలో మృతి చెందిన వారి ఇంటికి తీసుకెళతామని స్థానికులు కోరడంతో జేసీ అధికారులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కైకలూరు మండలం గోనెపాడు నుంచి ఉప్పుటేరు వరకు రహ దారి నిర్మాణం జాప్యంపై ప్రశ్నించారు. పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. కైకలూరులో ఎన్‌హెచ్, రవాణా, రెవెన్యూ, పోలీసు అధికారులతో ఎన్‌హెచ్ నిర్మాణ పనులపై ఎస్పీ, జేసీ సమీక్షించారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఎన్‌హెచ్ ఈఈ జి.సంజీవరాయుడు, డీఈ సత్యనారాయణ, తహసీల్దార్లు లతీఫ్‌పాషా, ఇబ్రహీం, శరత్, సీఐలు రవికు మార్, పి.కృష్ణ, వి.రవికుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు



ఎన్‌హెచ్ అధికారులకు సూచనలిస్తున్న ఎస్పీ, జేసీ



కరపత్రాలు ఆవిష్కరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

10,11 తేదీల్లో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు

భీమవరంటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలు ఈ నెల 10,11 తేదీల్లో భీమవరంలో జరగనున్నాయి. సమా వేశాలకు సంబంధించిన పోస్టర్లను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ విడుదల చేశారు. సమావేశాలకు రాష్ట్రం నలుమూలల నుంచి 250 మందికి పైగా విద్యార్థి నాయకులు హాజరు కానున్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమ స్యలైన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు, హాస్టళ్లలో నెలకొన్న సమస్యలుపై సమా వేశాల్లో చర్చించి తీర్మానాలు చేస్తారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్య, నూతన రోడ్ల నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు వంటి రాష్ట్ర అభి వృద్ధికి సంబంధించిన అంశాలపై కూడా చర్చించి, ఒక తీర్మానాన్ని రూపొందిస్తారు. ఈ తీర్మానాలను రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్య మంత్రి, విద్యాశాఖ మంత్రులకు అందజేయ నున్నారు. ఏబీవీపీ ప్రాంత సంఘటన కార్యదర్శి సుమన్, జిల్లా ప్రముఖ్ జ్వాల శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ వెంకట్ పాల్గొన్నారు.



వెయిట్‌లిఫ్టింగ్‌లో ఏఆర్‌డీజీకే విద్యార్థుల ప్రతిభ

ఏలూరు టూటౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఏఆర్‌డీజీకే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారని పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు ఎస్.శ్రీని వాస్ తెలిపారు. ఈ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి కే.భార్గవి 3వ స్థానం, మేఘన ద్వితీయ స్థానం, 9వ తరగతి చదువుతున్న పావని ప్రథమస్థానం సాధించారు. సీహెచ్ కీర్తన 58 కేజీల విభాగంలో ప్రథమ స్థానం, దీక్షిత 44వ కేజీల విభాగంలో ద్వితీయస్థానం ఎస్‌డీ మహీన్ 48 కేజీల విభాగంలో ప్రథమస్థానం సాధిం చారు. సీహెచ్ నిహారిక రెడ్డి 63 కేజీల విభా గంలో ప్రథమస్థానం, ఎన్.విహారిక 77 కేజీల స్థానంలో ప్రథమస్థానం, పవిత్ర 58 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం, ఇందు 44 కేజీల విభాగంలో తృతీయస్థానం సాధించారు. అనూష 53 కేజీల విభాగంలో తృతీయ స్థానం, షేక్ ఆశాజ్యోతి 77 కేజీల విభాగంలో ద్వితీయ స్థానం పొందారు. అథ్లెటిక్‌లో జే.పల్లవి ప్రథమ స్థానం పొందారు. వీరంతా త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌కు గుణ్ణంపల్లి విద్యార్థినులు

ద్వారకాతిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు మండలంలోని గుణ్ణంపల్లి హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వరప్రకాశం తెలిపారు. ఈనెల 9 నుంచి 11 వరకూ బాపట్ల జిల్లాలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు వీరు ఎంపికయ్యారన్నారు. జిల్లాస్థాయిలో ఇటీవల ఏలూరులో జరిగిన పోటీలలో హైజంప్‌లో రోషిణి, లాంగ్ జంప్‌లో ఐశ్వర్య, 600 మీటర్ల పరుగులో రమ్యకృష్ణలు ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు.




ఘనంగా ఏకాదశి ఉత్సవం

ద్వారకాతిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఉభయ దేవేరులతో చినవెంకన్నకు మంగళ వారం రాత్రి క్షేత్ర పురవీధుల్లో జరిగిన ఏకా దశి ఉత్సవం భక్తులను అలరించింది. స్వామి, అమ్మవార్లను తొళక్క వాహనంపై ఉంచి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా అట్టహాసంగా తిరువీధులకు తీసుకొచ్చారు.



పీచు పరిశ్రమకు మంచిరోజులు

కరోనా తరువాత కుదేలు
ధర పెరగడంతో తెరుచుకుంటున్న మూసివేసిన పరిశ్రమలు



దెందులూరు ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కరోనా దెబ్బకు కొబ్బరి పీచు పరిశ్రమలు మూతపడ్డాయి. ఇప్పుడిపుడే ధర కొంత ఆశాజనకంగా ఉండటంతో మళ్లీ పీచు పరిశ్రమలను నిర్వహిస్తున్నారు.కొబ్బరి పీచు పరిశ్రమ ద్వారా వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. దెందులూరు, పెదవేగి, ద్వారకా తిరుమల, అత్తిలి, ఉంగుటూరు తదితర మండలాల్లో పెద్దస్థాయిలో చిన్న తరహా కొబ్బరి పీచు పరిశ్రమలు ఉన్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం పీచు పరిశ్రమ ద్వారా సంవత్సరానికి ఏలూరు జిల్లాలో రూ.180 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగు తుండేవి. కరోనా తర్వాత అది రూ.130 కోట్లకు పడిపోయింది. నెలకు 18 టన్నుల ఉత్పత్తి చేస్తూ పరోక్షంగా 7 వేల మంది ఉపాధి పొందేవారు. కొబ్బరి పీచు ఉత్పత్తులను విశాఖ ఓడ రేవు ద్వారా విదేశాలకు ఎగుమతి చేసి విదేశీ మారక ద్రవ్యాన్ని పొందేవారు. కొబ్బరి పీచును ఎక్కువగా సోఫా సెట్లు, కార్పెట్లు. పరుపులు, తాళ్లు, తయారు చేయడానికి వినియోగి స్తారు. ప్రధానంగా మన రాష్ట్రం నుంచి చైనాకు కొబ్బరి పీచు ఎగుమతులు అవు తున్నాయి. ఇటీవల స్థానికంగా కుడా వీటి వినియోగం పెరగడంతో 30 శాతం ఉత్ప త్తులను ఇక్కడే ఉపయోగిస్తున్నారు. కరోనా వల్ల ఎగుమతులు నిలిచిపోవడంతో కొబ్బరి పీచు పరిశ్రమ నిర్వాహకులు నష్టాలను చవి చూశారు. కొంతమంది అప్పుల పాలై పరి శ్రమలను మూసివేశారు. ఇటీవల కొబ్బరికి మంచి రోజులు వచ్చాయి. కొబ్బరి పీచుకు కిలో ధర రూ.8 నుంచి రూ.13లకు పెరగ డంతో నిర్వాహకులు పరిశ్రమలను తిరిగి ప్రారంభిస్తున్నారు.

తయారీ ఇలా ..

కొబ్బరి తోటల నుంచి కూలీల ద్వారా కొబ్బరి డొక్కలను సేకరించి స్థానికంగా ఉన్న పరిశ్రమలకు చేరుస్తారు.ఇక్కడ యంత్రాల సాయంతో పీచును వేరు చేస్తారు. ఈ ప్రకి యలో వచ్చిన కొబ్బరి పొట్టును ఇటుకల బట్టీలకు విక్రయిస్తుంటారు. పరిశ్రమ వద్దకు తెచ్చిన డొక్కను పీచు తయారు చేయడానికి కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది.కిలో పీచుకు తయారు చేసేందుకు కూలీలు, యంత్రాల నిర్వహణ ఖర్చు రూ.8 అవుతుంది. కానీ ఆదాయమే రూ.8 నుంచి 9 రూపాయలు వస్తుండటంతో నిర్వాహకులకు ఏమీ మిగలక పోవడంతో పరిశ్రమలు తాత్కాలికంగా మూసి వేశారు. ఇప్పుడు ధర బావుండటంతో తిరిగి ప్రారంభిస్తున్నారు.

- **ప్రతికూల వాతావరణంతో నష్టాలు**



వ్యవసాయ రంగానికి అనుబంధంగా ఉన్న కొబ్బరి పీచు పరిశ్రమల నిర్వహణలో అనేక ఇబ్బం దులు పడుతున్నాం. ధర బాగానే ఉంది కదా అనుకునేలేపుగానే వర్షాల వల్ల ముడి సరుకు తడిసిపోతోంది. దీతో ఉత్పత్తి తగ్గి పోతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రాయితీ ఇచ్చి చిన్న పరిశ్రమలను ఆదుకోవాలి.

- గూడపాటి భీష్మ, యజమాని, మేదినరావుపాలెం

- **గోడౌన్లు లేక ఇబ్బందులు**



కొబ్బరి పీచు పరిశ్రమ చిన్న తరహా పరి శ్రమ. మార్కెట్ హెచ్చు తగ్గులు వల్ల ఎగుమతులు నిలిచిన సమయంలో తయారైన పీచును నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక తయారైన పీచు వర్షాలకు తడసిపోతు న్నది. అగ్ని ప్రమాదాల భారినపడి రూ.2 కోట్లు నష్ట పోయాం. చిన్న పరిశ్రమల నిర్వాహకులకు ప్రభుత్వాలు మరింత సహకారం అందించాలి.

- పెనుమత్స అచ్యుత రామరాజు, కొబ్బరిపీచు పరిశ్రమ నిర్వాహకుడు, జోగన్నపాలెం

భయపెడుతున్న వంతెనలు



ఆరవల్లిలో ప్రమాదకరమైన వంతెన

అత్తిలి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి) : తణుకు - భీమవరం, అత్తిలి- అలంపురం, ఉరదాళ్ల పాలెం- దువ్వ ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రమాదకర మలు పులు ఉన్నాయి. ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారినపడుతున్నారు. ఇటీవల రేలంగి శివారు గవర్ల పాలెం నుంచి కె.సము ద్రపుగట్టు వరకు బీటీ రోడ్డు నిర్మిం చారు. ఇటీవల ఈ మార్గంలో వెళుతున్న కారు అదుపుతప్పి విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టింది. ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు మలుపుల వద్ద, కాలువ వంతెనల వద్ద హెచ్చరిక బోర్డులు,

హెచ్చరిక బోర్డులేవి ?

స్పీడ్ బ్రేకర్లు, ఏర్పాటు చేయాలని ప్రయాణి కులు కోరుతున్నారు. రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. ముఖ్యంగా మలుపులు, జంక్షన్లు, స్కూల్ జోన్లు, ఇరుకైన బ్రిడ్జిలు ఉన్నచోట్ల బోర్డులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రేడియం స్టిక్కర్ల బోర్డులు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో వాహన దారులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త రహదారుల్లో ప్రయాణాలు చేసేవారు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారు.



బల్లిపాడులో మలుపు వద్ద బోల్తాపడిన కారు (ఫైల్)

ప్రమాదకరంగా పడమర విప్పర్రు బ్రిడ్జి

కింద భాగం ఊడి వేలాడుతున్న వైనం
భయపడుతున్న విద్యార్థులు, స్థానికులు



పెంటపాడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నిత్యం అవసరమయ్యే ప్రధాన వంతెనలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎప్పుడు పడిపోతాయా అన్నట్లుగా మారాయి. మండలంలోని పడమర విప్పర్రు బక్లెస్ డ్రైయిన్‌పై ఉండే వంతెన బీటలు వారి ప్రమాదకరంగా మారింది. ఈ గ్రామంలో ఉండే జడ్పీ ఉన్నత పాఠశాలకు నిత్యం విద్యార్థులు ఈ వంతెన పైనుంచే ప్రయాణం చేస్తుంటారు. వంతెన అవతల నివాసాలు ఉండేవారు, రైతులు నిత్యం ఈ వారధిపై నుంచే వెళ్తుంటారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుకుంది. వంతెన కింద భాగం కూడా రాళ్ళుగా ఊడిపోయి కిందకు వేలాడు తున్నాయి. వంతెనకు రెండుపక్కల ఉండే రైలింగ్ కూడా ఒక వైపునకు ఒరిగిపోయింది. దీంతో ఈ వంతెనపై ప్రయాణాలు సాగించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతులు, స్థాని కులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జాప్యం జరిగితే ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంది. అధికారులు స్పందించి వంతెన మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

జిన్నూరు వంతెన శ్లాబ్‌కు బీటలు

రాకపోకలు బంద్

పోడూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) :పురాతన కట్టడమైన జిన్నూరు వంతెనం శిథిలావస్థకు చేరింది. సుమారు 85 ఏళ్లనాటి జిన్నూరు వంతెనంపై నిత్యం వాహనాలు రాకపోకలతో రద్దీగా ఉంటుంది. వంతెనం శ్లాబ్ బీటలు తీయడంతో ప్రజలు భయాం దోళన చెందుతున్నారు. స్థానిక నాయకులు వంతెన పరిస్థితిని పరిశీలించి స్కూల్ బస్సులు, వాహనాలను వంతెనపైకి రాకుండా చర్యలు తీసుకున్నారు.ఇరిగేషన్ శాఖ ఏఈ ఎస్.శ్రీనివాసు వంతెన పరిస్థితిని పరిశీలించారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు వంతెనపై వాహనాలు రాకపోకలను బంద్ చేసి వంతెనం ఇరు వైపులా వాహనాలు రాకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. వంతెనం శిథిలావస్థకు చేరడంతో గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొత్త వంతెన నిర్మాణానికి రూ.2.50 కోట్లు నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర విభజన అనంతరం ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వంతెన నిర్మాణ పనులను ప్రారంభించి వంతెన నిర్మాణం పూర్తిచేశారు. వంతెనకు అప్రోచ్‌రోడ్డు వేయాల్సి ఉండగా తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే మంత్రి నిమ్మల రామానాయుడు కొత్త వంతెన అప్రోచ్‌రోడ్డు పనులపై దృష్టి పెట్టారు. రూ.1.40 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు వేగవంతం చేశారు. రెండు నెలల్లో వంతెనం ప్రారంభించేందుకు మంత్రి అన్ని చర్యలు తీసుకున్నట్లు స్థానిక నాయకులు దేవళ్ల ప్రసాదు, దేవళ్ల శ్రీరామకోటి మోహన్, దాసరి రత్నరాజు, పాల వలస తులసీరావు తెలిపారు.





నెరలు తీసి కిందకి దిగుపోతున్న వంతెన శ్లాబ్

ఫలించిన చినమామిడిపల్లి వాసుల పోరాటం

ఫుట్ పాత్ వంతెనకు రైల్వే ఓకే

నరసాపురం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చిన మామిడిపల్లి వద్ద మూసివేసిన రైల్వేగేట్ స్థలంలో ఫుట్ పాత్ వంతెన నిర్మాణం కోసం గ్రామ ప్రజలు చేస్తున్న పోరాటం ఫలించింది. నిర్మాణానికి ఎట్టకేలాకు రైల్వే అంగీకరించింది. మూసి వేసిన రెండు గేట్లను కలుపుతూ సుమారు 250మీటర్ల మేర ఫుట్‌పాత్ వంతెన నిర్మాణానికి పచ్చజెండా ఊపింది. సైకిళ్లు, ఆటోలు, బైక్‌లు వెళ్లే విధంగా నిర్మించే ఈ వంతెనకు రూ 5 నుంచి రూ 6 కోట్లు వరకు ఖర్చు అవుతుందని అంచన. రైల్వేస్టేషన్‌కు సమీపంలోనే చినమామిడిపల్లి రైల్వేగేట్ ఉంది. బ్రిటిష్‌హాయం నుంచి ఈ గేటు కొనసా గుతుంది. నరసాపురం నుంచి మత్స్యపురి మీదుగా భీమవరం వెళ్లాలంటే ఈ మార్గం గుండానే వెళ్లాలి. రాష్ట్ర విభజన తరువాత ఈ రోడ్డును విస్తరించారు. దీంతో ట్రాఫిక్ పెరిగింది. అయితే విజయవాడ- నరసాపురం మధ్య డబ్లింగ్ లైన్ పనులు పూర్తికావడంతో రైల్వే గేట్‌ను మూసివేసింది. ప్రత్యామ్నాయంగా గేటు అవతల వైపునా రైల్వే స్థలాన్ని చూపించింది. ఆ మార్గం గుండా స్టేషన్‌పేట మీదుగా పట్టణానికి రోడ్డు మార్గాన్ని కల్పించింది. దీంతో ప్రజలకు గేటు సమస్య తీరింది. అయితే ఒకవైపు గేటు మూసివేయడంతో చినమామిడిపల్లిలో ఒక ప్రాంతం ప్రజలు మూసివేసిన అవుతల వైపుకు వెళ్లాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తుంది. చాలామంది రైతులకు అక్కడే పోలాలు ఉన్నాయి. దీనిపై అనేక మార్లు రైల్వే అధికారులకు విన్నవించారు. ఆందోళనలు చేశారు. నాలుగేళ్లుగా వీళ్ల చేస్తున్న పోరాటం చివరికీ ఫలిం చింది. మంజూరైన వంతెన నిర్మాణ స్థలాన్ని ఆర్డీవో దాసిరాజు, టీడీపీ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, కౌన్సిలర్ పాలూరి బాబ్జీలు రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. మూసివేసిన రెండు గేట్లును కలుపుతూ నిర్మించే ఈ వంతె నపై చిన్న వాహనాలు వెళ్లే విధంగా డిజైన్ చేశారు. ప్రస్తుతం ఉన్న పట్టాలపై నుంచి ఈ వంతెన నిర్మాణ పనులు చేపట్ట నున్నారు. పనులు మొదలు పెడితే ఏడాది లోపు వంతెన నిర్మాణం పూర్తవుతుందని రైల్వే అధికారులు చెప్పుతున్నారు.



వంతెన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో దాసిరాజు, పొత్తూరి (ఫైల్)

మా పోరాటం ఫలించింది..



బ్రిటిష్ హయాం నుంచి చినమామిడిపల్లి వద్ద రైల్వేగేట్‌లు కొనసాగుతున్నాయి. నాలుగేళ్ల క్రితం రైల్వే ఆకస్మికంగా మూసి వేసింది. దీంతో వార్డు రెండు ముక్కలైంది. రైల్వే వేసిన రోడ్ గ్రామాలకు వెళ్లే ప్రజలకు అను కూలంగా ఉందే తప్ప చిన మామిడిపల్లివాసులకు కష్టాలు మాత్రం తీరలేదు. గేటు దాటాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తున్నది. అండర్ టన్నెల్ వేయాలని సీఎం చంద్రబాబుకు, కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మకు విన్నవించారు. చివరకు వారు సానుకూలంగా స్పందించారు. వంతెన పూర్తయితే మా కష్టాలు తీరినట్లే.

- పాలూరి బాబ్జీ, కౌన్సిలర్



కాళీపట్నం లాకు శిథిలం

ఉప్పుటేరు నీరు పంట కాలువలోకి

మొగల్తూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని జీఎన్‌వీ కెనాల్‌కు శివారు ప్రాంతంలో ఉన్న కాళీపట్నం లాకు తలుపులు పూర్తిగా శిథిలమై దశాబ్దన్నర కాలం పైబడినా ప్రభుత్వ యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. లాకు తలుపులు శిథిలమవ్వడంతో లాకు అవతల గల మాగలేరు డ్రెయిన్‌లోని ఉప్పునీరు జీఎన్‌వీ కెనాల్‌లోకి ప్రవహించి మంచినీటిని కలుషితం చేస్తున్నది. ఫలితంగా జీఎన్‌వీ కెనాల్ ద్వారా కోమటితిప్ప బహుత్తర మంచినీటి ప్రాజెక్టుకు, వరి సాగుకు, గృహ అవ సరాలకు కాలువ నీరు నిరుపయోగంగా మారడంతో కాళీపట్నం రెవెన్యూ పరిధి ఆరు గ్రామ పంచాయతీల పరిధిలోని రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాళీపట్నం రెవెన్యూ పరిధిలో పంట నీరు అందని పరిస్థితి నేపథ్యంలో ఎక్కువ శాతం ఆక్వా చెరువులు తవ్వేశారు. కాళీపట్నం శివారు ప్రాంతం కావడంతో శిథిలమైన లాకు స్థానంలో రెగ్యులేటర్ నిర్మిస్తామని 14 సంవత్సరాల క్రితం అప్పటి రాష్ట్ర నీటి పారు దలశాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య కాళీపట్నం వచ్చినప్పుడు రెగ్యులేటర్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. రూ.90 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అనంతరం రాష్ట్ర విభజన, ప్రభుత్వాలు మారడంతో రెగ్యులేటర్ నిర్మాణం అటకెక్కింది. కనీసం లాకు తలుపులు అయినా పునర్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

తాగునీటికి పాట్లు

ఏడాది పొడవునా సమస్యలే
మార్చని ఇసుక.. శుభ్రత లేని ఫిల్టర్ బెడ్లు..
శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు
ఆకివీడు వాసుల నీటి కష్టాలు

ఆకివీడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు నగర పంచాయ తీలో ఏడాది పొడవునా తాగునీటి సమస్యలు వెంటాడుతున్నాయి. పట్టణ పరిధిలో ఇరవై వార్డుల్లో యాభై వేలకు పైబడి ఉన్న జనా భాకు ప్రతీ రోజూ ఉదయం, సాయంత్రం 18 లక్షల లీటర్ల తాగు నీరు సరఫరా చేస్తున్నారు. భుజబలరాయుడు స్టోరేజ్ ట్యాంకు, ఆనాల, గాలిబ్, ధర్మాపురం మంచినీటి చెరువులకు సంబంధించి కొన్నిచోట్ల ఫిల్టర్ బెడ్లలో ఏళ్లు గడుస్తున్నా ఇసుక మార్చకపోవ డంతో రావాటర్ ఫిల్టర్ అవ్వడం లేదు. ఇసుక మూడేళ్లకొకసారి మార్చాల్సి ఉంది. తాగునీరు సరఫరా చేసే మెయిన్ (సిమెంట్) పైపులైన్ ఆరవై ఏళ్ల పైబడి కావడంతో అవి తరచూ పగిలిపో తున్నాయి. దీంతో మురుగునీరు మంచినీటి పైపులైన్లలో కలవ డంతో తాగునీరు కలుషితమవుతోంది. ఆ నీటినే తాగి ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. అదనంగా ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. ప్రస్తుతం నాలుగు ట్యాంకులు శిథిలావస్థకు చేరుకోవడంతో తరచూ తాగునీరు వృథా అవుతోంది. మరో నాలుగు ట్యాంకులు కొత్తవి నిర్మిస్తే తాగునీటి సమస్య తీరుతుంది. మంచినీటి చెరువులకు అవుట్‌లెట్‌లు లేవు. జనరే టర్లు లేకపోవడంతో కరెంటు పోతే ఇబ్బంది ఎదురవుతోంది. ట్రాన్స్‌ఫార్మర్లు కూడా లేవు. పెద్ద, చిన్న పల్లె వీధులు, తెలగపా ముల వీధి , రైల్వే స్టేషన్ ఎదురుగా, సమతానగర్, ఎఫ్‌సీఐ దగ్గ రకు ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా తాగునీరు సరఫరా చేస్తు న్నారు. పట్టణంలో సుమారు ఎనభై శాతం బయట నీటిని కొను గోలు చేసుకుంటున్నారు. కొందరు ఇళ్ళలోనే ఫిల్టర్ వేయించుకొని నీటిని తాగుతున్నారు. సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు పాలకవర్గం, అధికారులు దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవడం లేదని ప్రజానీకం వాపోతున్నారు.

- **పురుగులు కూడా వస్తున్నాయి**



కుళాయిల ద్వారా సరఫరా చేసే మంచి నీటిలో ఒక్కోసారి పురుగులు కూడా వస్తు న్నాయి. మూడేళ్లకు ఒకసారి ఫిల్టర్ బెడ్‌లలో ఇసుక మార్చాల్సి ఉండగా ఏళ్లు గడుస్తున్నా ఇసుక మార్చడం లేదు. దీంతో రావాటర్ ఫిల్టర్ కావడం లేదు. ఆ నీటినే సరఫరా చేస్తున్నారు. భుజబల రాయుడు చెరువు దగ్గర ఇన్‌టేక్ వెల్ శ్లాబ్ పగిలిపోయి చాలా కాలం అవుతున్నా మరమ్మతులు కూడా చేయించడం లేదు.

-బత్తుల శ్యామల, టీడీపీ కౌన్సిలర్, ఆకివీడు

- **ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా నీరు**



పట్టణ పరిధిలో పలు ప్రాంతాలకు సరైన పైపు లైన్లు లేకపోవడంతో ఏడాది పొడవునా ట్యాంకర్ల ద్వారా తాగునీ రు సరఫరా చేస్తున్నారు. శివారు ప్రాంతాలకు కాకుండా పట్టణ నడిబొడ్డునున్న ప్రాంతాలకు కూడా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలి.

నేరెళ్ళ ప్రసన్న,జన సేన కౌన్సిలర్, ఆకివీడు





ఫిల్టర్ బెడ్‌లో పచ్చగా కనపడుతున్న నీరు.. ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు



శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు

ఇసుక టెండర్ దశలో ఉంది



ఫిల్టర్ బెడ్లకు ఇసుక మార్చడానికి టెండర్ దశలో ఉంది. 80 శాతం పైనే ఇసుక మార్చాం. అమృత్ 2.0 పథకం మంజూరైంది. ఆ నిధులతో పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కారం మవు తుంది. ఎమ్మెల్యే రఘురామరాజు నేతృ త్వంలో రూ.30 కోటట్లో పైపులైన్ మర మ్మతులు ఆకివీడు వరకూ జరిగాయి. త్వరలోనే తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయి.

- జి.కృష్ణమోహన్, కమిషనర్, ఆకివీడు

సీఎం చంద్రబాబుతో 'గన్ని' భేటి


సీఎంను కలిసి పలు అంశాలను వివరిస్తున్న గన్ని వీరాంజనేయులు

ఏలూరు- ఆంధ్రజ్యోతి ప్రతినిధి : కూటమిలో భాగస్వామ్య పక్షాల పనితీరు, జిల్లాలో నెలకొన్న వాస్తవ పరిస్థితులతో పాటు ఆప్కాబ్ వ్యవహారాలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో ఆప్కాబ్ చైర్మన్, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వివరించారు. ఈ మేరకు ఆయన సీఎం చంద్రబాబును మంగళవారం కలిసిన సందర్భంలో ఈ అంశాలు చర్చకు రావడంతో తన దగ్గర ఉన్న సమాచారాన్ని సీఎంకు గన్ని తెలియజేశారు. జిల్లాలో కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య నెలకొన్న పరిస్థితులపై వీరిద్దరి మధ్య చర్చకు వచ్చాయి. తొలి అడుగు కార్యక్రమంలో జిల్లాలోనే ఉంగుటూరు తొలిస్థానంలో నిలవడాన్ని సీఎం ప్రస్తావించినప్పుడు మిగతా నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు పట్టుదలతో ఈ కార్యక్రమాన్ని నిర్వర్తించాలని సీఎంకు గన్ని వీరాంజనేయులు వివరాలను తెలియజేశారు.

రేపు ఏలూరులో జేఏసీ-అమరావతి ఉమ్మడి జిల్లా సమావేశం

ఏలూరు అర్బన్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):ఉద్యోగులకు రావలసిన బకాయిలు, 12వ పీఆర్సీ నియామకం, ఐఆర్, పెండింగ్‌లో వున్న డీఏలు, పెన్షనర్లకు చెల్లించాల్సిన బకాయిలు, టీచర్ల సమస్యలపై ఏపీ జేఏసీ-అమరావతి ఉమ్మడి జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు సంఘ జిల్లా చైర్మన్ కె.రమేష్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏలూరులోని రెవెన్యూ భవనంలో ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందని పేర్కొన్నారు. అదేరోజున మధ్యాహ్నం మూడు గంటలకు రెవెన్యూ సర్వీసెస్ సంఘ కార్యవర్గసమావేశం, సాయంత్రం నాలుగు గంటలకు జిల్లాలోని తహసీల్దార్లు, ఉద్యోగుల సమస్యలపై సమావేశాలు జరుగుతాయన్నారు. జిల్లాలోని తహసీల్దార్లు, జేఏసీ-అమరావతి కార్యవర్గ సభ్యులు, ఏపీఆర్ఎస్ఏ కార్యవర్గ సభ్యులు, అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయసంఘాల నాయకులు, ఉద్యోగులు, టీచర్లు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

'విద్యాశక్తి' బహిష్కరణకు 'ఫ్యాప్టో' నిర్ణయం

ఏలూరు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురి చేసేవిధంగా 'విద్యాశక్తి' పేరిట విద్యాశాఖ తలపెట్టిన కార్యక్రమం ఐచ్ఛికమేనని ప్రభుత్వం సూచించినప్పటికీ జిల్లాలో కొందరు అధికారులు టీచర్లను ఒత్తిడిచేయడంపై ఏపీ ఉపాధ్యాయసంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ మేరకు మంగళవారం డీఈవో వెంకటలక్ష్మమ్మను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. టీచర్లను ఇబ్బందులకు గురిచేస్తున్న దృష్ట్యా జిల్లాలో విద్యాశక్తి కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్టు డీఈవోకు తెలియజేశామని ఫ్యాప్టో నాయకులు రవికుమార్, రెడ్డిదొర, పవన్‌కుమార్, రమేష్, తదితరులు తెలిపారు.

దువ్వ దానేశ్వరమ్మకు మంత్రి దుర్గేశ్ పూజలు


దువ్వ దానేశ్వరమ్మకు పూజలు చేస్తున్న మంత్రి దుర్గేశ్

తణుకు రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): దువ్వ గ్రామంలోని దానేశ్వరి అమ్మవారిని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం పెరవలి మండల మాజీ వైస్ ఎంపీపీ నందిప చక్రవర్తి గత ఏడాది జరిగిన ఎన్నికలలో ఎమ్మెల్యేగా దుర్గేశ్ గెలుపొం దాలని మొక్కుకున్నారు. ఆ మొక్కును చెల్లించుకునేందుకు మంగళవారం దానేశ్వరి అమ్మవారిని మంత్రి దుర్గేశ్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది, ఆలయ మర్యాదలతో మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదపండితుల ఆశీర్వచనం పలికారు. పూజల అనంతరం మంత్రికి అమ్మవారి చిత్ర పటాలను అందజేశారు. కార్యక్రమంలో పెరవలి డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బూరుగుపల్లి శ్రీనివాసు, నాయకులు పాల్గొన్నారు.


శిక్షణ ముగింపులో పాల్గొన్న డీఎంహెచ్‌వో, ఉమ్మడి జిల్లా వైద్యాధికారులు, ప్రొఫెసర్లు

కేన్సర్ ముందస్తు నివారణపై ముగిసిన శిక్షణ

ఏలూరు అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : కేన్సర్ నివారణకు ముందస్తు గుర్తింపు కార్యాచరణ, అంటువ్యాధుల గుర్తింపు, నిర్ధారణ పద్ధతులపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని గైనకాలజిస్టులు, డెంటల్ సర్జన్లకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎన్సీడీ విభాగం ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మూడు రోజులపాటు నిర్వహించిన పునశ్చరణ శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. చివరిరోజు కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం మాట్లాడుతూ నోటిలో పుండ్లు, రొమ్ముల్లో గడ్డలు కేన్సర్‌కు కారణం కావచ్చని, వీటిని తొలి దశలోనే గుర్తించినట్టయితే రోగిని ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడవచ్చని పేర్కొన్నారు. సైలెంట్ కిల్లర్‌గా పరిగణించే కేన్సర్ లక్షణాలను ప్రాథమికంగా ఎలా గుర్తించవచ్చో పీహెచ్‌సీల్లో పనిచేసే ఏఎన్ఎంలకు శిక్షణ ఇవ్వాలని సూచించారు. మూడు రోజుల శిక్షణను పూర్తి చేసుకున్న వైద్యనిపుణులు తదుపరి ఉమ్మడి జిల్లాలోని డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు విడతలవారీగా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మాస్టర్ ట్రైనీలుగా ప్రభుత్వ వైద్యకళాశాల ఎస్‌పీఎం, పెథాలజీ, గైనిక్ విభాగాల ప్రొఫెసర్లు వ్యవహరించారు. సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఎస్.రాజు, ప్రివెంటివ్ అంకాలజీ యూనిట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ గంగాభవాని, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నరేంద్రకృష్ణ, డాక్టర్ రాజేష్, ఎపిడిమాలజిస్టు సుభాష్ పాల్గొన్నారు.

ములగలంపాడులో బంగారం చోరీ

ఏలూరు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఇంటిలోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన లింగపాలెం మండలంలో మంగళవారం జరిగింది. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపిన వివరాలివి.. ములగలంపాడు గ్రామానికి చెందిన రెడ్డి వెంకన్న అతడి భార్య పనుల నిమిత్తం బయటకు వెళ్లగా దుండగులు ఇంటి తాళాలు పగులకొట్టి కాసున్నర బంగారం ఆభరణాలను తస్కరించినట్టు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఓటీపీలు వస్తేనే రిజిస్ట్రేషన్లు

తరచూ కొత్త విధానాలతో కక్షిదారుల అసంతృప్తి



కోట్ల రూపాయల ఆదాయం వస్తున్న రిజిస్ట్రేషన్ శాఖ తరచూ కొత్త విధానాలను రూపకల్పన చేయడంతో క్రయవిక్రయదారులతో పాటు అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల 27వ తేదీ నుంచి ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌కు ఓటీపీ విధానం తీసుకొచ్చింది. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నప్పటికీ ఓటీపీ విధానానికే రిజిస్ట్రేషన్ శాఖ మొగ్గుచూపుతుంది. మొదటిలో కొంత ఇబ్బందులు ఉన్నప్పటికీ క్రమక్రమంగా సమస్యలు తొలగిపోతాయని రిజిస్ట్రేషన్ శాఖ ముందుకు వెళుతోంది. దీనిపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ప్రభుత్వ ఆదాయానికి గండి
- ఆధార్‌కు ఫోన్ నంబరు లింక్ కాకపోవడంతో ఓటీపీ అవస్థలు
- అయినా ఓటీపీ విధానానికే మొగ్గు చూపిన రిజిస్ట్రేషన్ శాఖ
- క్రయ విక్రయదారులు సైబర్ నేరగాళ్లపై జాగ్రత్తగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

ఆచంట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రతిరోజూ రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా కోట్ల రూపాయలు ఆదాయం వస్తుంది. అటువంటి ఆదాయం వచ్చే శాఖపై రిజిస్ట్రేషన్ శాఖ కొత్త విధానం తీసుకువస్తుండడంతో ముఖ్యంగా క్రయ విక్రయదారులతోపాటు అధికారులు తరచూ ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించి తరచూ కొత్త విధానాలు తీసుకువస్తుండడంతో ఇటీవల కాలంలో రిజిస్ట్రేషన్లు సజావుగా జరగడం లేదు. ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతుంది. అమ్మకం, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి 2.0 కొత్త విధానం తీసుకువచ్చింది. మొదటిలో అనేక మంది ఈ విధానం వ్యతిరేకరించినప్పటికి క్రమక్రమంగా ఈ విధానానికి అలవాటు పడి రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. ఇటీవల రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి ప్రభుత్వం స్లాట్ బుకింగ్ విధానం తీసుకువచ్చింది. ఈ విధానం కూడా మొదటిలో కక్షిదారులు పెద్దఎత్తున అసంతృప్తి వ్యక్తం చేశారు.

కొత్తగా ఓటీపీ విధానం..

మళ్లీ కొత్తగా గతనెల 27 నుంచి రిజిస్ట్రేషన్‌కు సంబంధించి క్రయ విక్రయదారులకు ఓటీపీ విధానం తప్పనిసరి చేసింది. ఈమేరకు క్రయ విక్రయదారులు ప్రస్తుతం అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమందికి ఆధార్‌కి మొబైల్ నంబరు లింక్ చేసుకోవడం లేదు. దీనివల్ల ఓటీపీలు రాక అవస్థలు పడుతున్నారు. కొంతమంది ఓటీపీలకు సంబంధించి వృద్ధాప్యం కలిగిన వారు వారి కుమార్తెలు, కుమారులకు మొబైల్ నంబరుకు లింక్ చేయడంతో వారి కుటుంబసభ్యులు వేరే దూరప్రాంతంలో ఉండడంతో మొబైల్ పని చేయని కారణం ఒకటి అయితే మరికొంతమంది ఓటీపీ ఎందుకని వారి కుటుంబ సభ్యులనే ప్రశ్నిస్తున్నారు. భూమి స్థలాలు ఇల్లు క్రయవిక్రయాలు జరపాలంటే ప్రస్తుతం రిజిస్ట్రేషన్‌శాఖ విధించిన ఓటీపీ విధానం వల్ల దస్తావేజుల్లో పొందు పరిచిన క్రయ విక్రయదారులకు తప్పనిసరిగా ఆధార్ ఓటీపీ వస్తేనే పబ్లిక్‌డేటా ముందుకువెలుతుంది. అలా కాకపోతే రిజిస్ట్రేషన్లు నిలిచిపోతున్నాయి. కొంతమంది వారి కుటుంబ సభ్యులకు సంబంధించి పెండ్లి కానుకగా, అలాగే అనారోగ్య కారకంగా దస్తావేజులు ఓటీపీల వల్ల నిలిచిపోవడంతో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఓటీపీతోనే స్లాట్ బుకింగ్..

ఇది ఒక పద్ధతి అయితే దీనికి సంబంధించి స్లాట్ బుకింగ్ విధానంలో కూడా ఓటీపీ చెబితేనే స్లాట్ బుకింగ్ అవుతుంది. మరోసారి క్రయ విక్రదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం గతనెల జూలైలో చేపట్టిన ఓటీపీ విధానం ద్వారా క్రయ విక్రయదారులు తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి కోట్ల రూపాయలు ఆదాయం ఇచ్చే శాఖపైనే ఇటువంటి నిబంధనలు విధిస్తున్నారని కొంత మంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఓటీపీ విధానం వల్ల కొంతమందికి ఆధార్ లింక్ కాకపోవడంతో క్రయ విక్రయదారులు ఆధార్ సెంటర్‌లకు క్యూ కడుతున్నారు. ఓటీపీ విధానం ద్వారా ఇటీవల కాలంలో రిజిస్ట్రేషన్లు ఎక్కడా కూడా సజావుగా సాగడం లేదు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబంలో తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అధికారులు స్పందించి తక్షణమే తరచూ రిజిస్ట్రేషన్‌లో కొత్త విధానాలను తీసుకురాకుండా ఇటీవల ప్రవేశపెట్టిన కొత్త విధానాన్ని సవరించి సజావుగా రిజిస్ట్రేషన్‌లు అయ్యేట్లు చూడాలని పలువురు కక్షిదారులు కోరుతున్నారు.

పోలీస్ శాఖ ప్రచారం..

ఓటీపీ విషయంలో ప్రజలందరూ సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఇప్పటికే పోలీసు శాఖ వారు పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నారు. చరవాణిలో కూడా సైబర్ నేరగాళ్ల పట్ల ఓటీపీ విషయంలో ఎవరికి చెప్పవద్దంటూ పదేపదే చెబుతున్నారు. బ్యాంక్ అధికారులు కూడా ఓటీపీ ఎవరికి చెప్పవద్దంటున్నారు. ఇలాంటి పరిస్థితిల్లో రిజిస్ట్రేషన్ శాఖ కొత్తగా ఓటీపీ విధానం ఎందుకు తీసుకువచ్చిందంటూ కక్షిదారులే ప్రశ్నిస్తున్నారు.

'సూర్యఘర్ పథకం'పై అవగాహన కల్పించాలి / ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్ సూర్యప్రకాశ్


డిప్యూటీ స్పీకర్ రఘురామతో విద్యుత్ శాఖ డైరెక్టర్ సూర్యప్రకాశ్, తదితరులు

భీమవరంటౌన్/కాళ్ల,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ప్రతి వినియోగదారుడు సూర్యఘర్ పథకంలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలని ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ టి. సూర్యప్రకాశ్ ఆదేశించారు. ఏపీ ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా భీమవరం వచ్చిన ఆయన ఎస్ఈ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో విద్యుత్. వినియోగదారులకు అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేసేందుకు అధికా రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏప సబ్ స్టేషన్లపరిధిలో అంతరా యాలు వస్తునాయో ప్రశ్నించారు. కొత్తగా నిర్మిస్తున్న విద్యుత్తు సబ్‌స్టేషన్‌ల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. ఈ సందర్భంగా ఆయనను సిబ్బంది సత్కరించారు. ఈఈ ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులును మర్యాద పూర్వకంగా కలిశారు.

డిప్యూటీ స్పీకర్‌ను కలిసిన విద్యుత్ శాఖ అధికారులు

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజును మంగళవారం కాళ్ల మండలం పెద అమిరంలోని ఆయన కార్యాలయంలో ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ టీవీ సూర్యప్రకాశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ పరిధిలోని పలు సమస్యలపై చర్చించారు. ఆకివీడు మండలం పెదకాపవరంలో నూతన సబ్ స్టేషన్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని, ఉండి నియోజకవర్గంలో లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించి, నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం ఇవ్వడానికి చర్యలను తీసుకోవాలని కోరారు.


జీవో 137 ఉపసంహరించాలని ఈయూ నాయకుల నినాదాలు

ఆర్టీసీ ఆస్తులను ధారాదత్తం చేస్తే ఊరుకోం

- ఈయూ రీజనల్ కార్యదర్శి రాంబాబు హెచ్చరిక

ఏలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):ప్రజారవాణా(ఆర్టీసీ) ఆస్తులను ప్రైవేట్ వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేస్తే ఊరుకునేది లేదని, ఐక్యంగా ఉద్యమిస్తామని ఎంప్లాయీస్ యూనియన్(ఈయూ) రీజనల్ కార్యదర్శి బి.రాంబాబు అన్నారు. ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరులోని కపర్థి భవన్‌లోని ఈయూ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ గవర్నర్‌పేట డిపోలు, పాతబస్టాండ్‌కు సంబంధించిన 15 ఎకరాలు కలిపి రూ.400 కోట్ల విలువైన స్థలం లులూ షాపింగ్‌మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఈ రెండు డిపోల పరిధిలో 1,100 మంది ఉద్యోగులను ప్రజలకు దూరం చేయాలన్న కుట్రలను భగ్నం చేస్తామన్నారు. వెంటనే స్థలం కేటాయింపు జీవో 137 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ ప్రభుత్వ పెద్దలే 2014లో విజయవాడ ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాల స్థలం 29 ఎకరాలను హెచ్‌ఈఎల్ కంపెనీకి కట్టబెట్టారని, అందుకు బదులుగా ప్రభుత్వం ఇస్తామన్న స్థలం ఇప్పటివరకు ఒక్క గజం ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆర్టీసీని కాపాడుకునేందుకు ఏ పోరాటాలకైనా సిద్ధంగా ఉంటామని తెలిపారు. కేవీ రాఘవులు, వై.శ్రీనివాస్, టి.ఆంజనేయులు, టి.బాబూరావు, పాండు, నూజివీడు సెక్రటరీ కుమార్ పాల్గొన్నారు.

కన్నడపై శిక్షణకు రంగాపురం టీచర్ ఎంపిక


సాయిలక్ష్మి

ముదినేపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మైసూర్ సదరన్ రీజినల్ లాంగ్వేజ్ సెంటర్ నిర్వహిస్తున్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్‌లో కన్నడ భాషపై శిక్షణ పొందేందుకు ముదినేపల్లి మండలం రంగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ముండూరు సాయిలక్ష్మికి అవకాశం లభించింది. ఈ ఇనిస్టిట్యూట్‌లో కన్నడ భాషపై 10 నెలల డిప్లొమో కోర్సులో శిక్షణ పొందేందుకు ఆమెను ఎంపిక చేస్తూ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణకు ఇటీవల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా సాయిలక్ష్మి కన్నడ భాషలో శిక్షణకు దరఖాస్తు చేశారు.


సినీ నిర్మాత డాక్టర్ డీవీఎన్ రాజు మృతి

- పోడూరులో విషాదచాయలు


డీవీఎన్.రాజు (ఫైల్)

పోడూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సినీ నిర్మాత, సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ దాట్ల వెంకట నరసింహరాజు (డీవీఎన్ రాజు)(88) మంగళవారం హైదరాబాదులోని ఆయన స్వగృహంలో మృతిచెందారు. ఆయన స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా పోడూరులో విషాదచాయలు అలుముకున్నాయి. ఆయన మెడికల్ విద్యనభ్యసించి మద్రాసులో వైద్యుడిగా స్థిరపడ్డారు. దివంగత ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి ప్రముఖులకు ఆయన వైద్యసేవలందించారు. ఆయన హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పుడు ఎన్టీఆర్‌తో సినిమా తీయాలన్న సంకల్పం బలంగా ఉండడంతో వైద్యవృత్తి చేస్తూ సినీ ప్రముఖులతో పరిచయాలు పెంచుకుంటూ చివరకు ఎన్టీఆర్‌తో 'సింహబలుడు, కలియుగదైవం' సినిమాలు తీశారు. సూపర్‌స్టార్ కృష్ణతో 'జయం మనదే', చిరంజీవితో 'ఇంటి గుట్టు' సినిమా తీశారు. సెన్సార్ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. ఆయనకు భార్య ఉదయ్, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు, బంధుమిత్రులు ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. పోడూరు గ్రామానికి చెందిన ఆయన కుటుంబ సభ్యుడు రుద్రరాజు విజయరామరాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ అంటే ఎంతో అభిమానమని వైద్య వృత్తి చేస్తూ ఎన్టీఆర్‌తో సినిమా తీయాలనే కలను నెరవేర్చుకున్నారన్నారు.

పూలపల్లిలో గ్యాస్ లీకై మంటలు


పూలపల్లిలో గ్యాస్ లీకై వ్యాపించిన మంటలు

పాలకొల్లురూరల్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామంలో మంగళవారం గంటా సత్తిబాబు ఇంట్లో వంట చేస్తుండగా రెగ్యులేటర్ సరిలేకపోవడంతో మంటలు వ్యాపించాయి. స్థానికులు భయభ్రాంతులకు గురై ఫైర్‌స్టేషన్‌కు సమా చారం అందించారు. ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారి కె.శ్రీనివాసు సిబ్బందితో పాటు హెచ్‌పీ గ్యాస్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈమేరకు ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో రూ.20 వేలు ఆస్తి నష్టం వాటిల్లిందని ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జి అధికారి తెలిపారు.

క్రైం సమాచారం

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): అపెండిస్ ఆపరేషన్ చేసినప్పటికీ ఇంకా కడుపునొప్పి రావడంతో ఓ యువకుడు మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దెందులూరు మండలం మసీదుపాడు గ్రామానికి చెందిన కొరపాటి అజయ్‌బాబు (19)కి కడుపులో నొప్పి రావడంతో అపెండిస్ ఆపరేషన్ చేశారు. అయినప్పటికి కడుపునొప్పి తగ్గకపోవడంతో ఈనెల 2వ తేదీన పురుగుల మందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతున్న అతను మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారమిచ్చారు. మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ చదువుతున్న ఒక విద్యార్థి సబ్జెక్టులు ఫెయిల్ కావడతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో 42 రోజుల నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. చింతలపూడి మండలం తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆట్రు మహేశ్వరరావు, రజని దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన ఆట్రు ప్రేమ్‌సాయి(18) పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని సబ్జెక్టులు ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై చింతలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం


తస్వీర్ మృత దేహం

మొగల్తూరు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో ఈనెల 4వ తేదీన సముద్ర స్నానానికి దిగిన బి.తస్వీర్ మృతదేహం కృష్ణా జిల్లా చిన్నగొల్లపాలెం తీరంలో మంగళవారం విగత జీవిగా కొట్టుకు వచ్చింది. భీమవరంలోని ఒక ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఆటపాటగా గడిపేందుకు సోమవారం పేరుపాలెం సాగరతీరానికి చేరుకున్నారు. సముద్ర స్నానానికి దిగిన ఈ విద్యార్థుల్లో బి.తస్వీర్ అనే విద్యార్థి గల్లంతయ్యాడు. మంగళవారం కృష్ణాజిల్లా చిన్నగొల్లపాలెం తీరంలో తస్వీర్ మృతదేహం కొట్టుకురావడంతో మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహన్ని నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు.

రెండు కార్లు ఢీ.. తప్పిన ముప్పు


రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు

కైకలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో కైకలూరు మండలం ఆలపాడులో రెండు కార్లు ఢీకొన్న సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున కొంతమేరకు రహదారి అభివృద్ధి పనులు చేసి మధ్యలో వదిలివేయడంతో వేగంగా కైకలూరు నుంచి ఆకివీడు వెళ్తున్న కారు రహదారి గోతుల్లో పడి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. ఈమేరకు రెండు కార్లకు ముందుభాగాలు నుజ్జునుజ్జుఅయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. రహదారి నిర్మాణ పనుల్లో హెచ్చరిక బోర్డులు లేకపోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు.. ఆటో డ్రైవర్ మృతి


స్తంభాన్ని ఢీకొట్టడంతో ధ్వంసమైన కారు ముందుభాగం

ద్వారకాతిరుమల, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): ఓ భక్తుని కారు ఆటోను వేగంగా ఢీకొట్టడంతో ఆటో తిరగబడి తీవ్రగాయాలైన ఆటో డ్రైవర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ద్వారకాతిరుమల విర్డ్ ఆసుపత్రి శివారులో మంగళవారం జరిగింది. ద్వారకాతిరుమల ఎస్ఐ టి.సుధీర్ తెలిపిన వివరాలివి.. పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన చౌదిమెళ్ల విజయరాజు(40) మంగళవారం తన ఆటోలో ఎన్టీఆర్ వైద్యసేవపై ప్రచారం చేస్తూ ద్వారకాతిరుమల నుంచి భీమడోలు వైపునకు వెళ్తున్నాడు. ఇదే సమయంలో చెన్నై నుంచి సురేష్ అనే భక్తుడు కుటుంబంతో కలిసి దైవదర్శనం నిమిత్తం ద్వారకాతిరుమలకు వస్తున్నాడు. ఘటనాస్థలం వద్దకు వచ్చేసరికి కారు వేగంగా ఆటోను ఢీకొట్టడంతో బోల్తాకొట్టింది. అనంతరం వేగాన్ని అదుపుచేసుకోలేక కారు కరెంటు స్తంభాన్ని ఢీకొని పాక్షికంగా ధ్వంసమైంది. ఆటోను నడుపుతున్న విజయరాజు తీవ్రగాయాలు కాగా ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వృద్ధురాలి కోసం కాలువలో గాలింపు

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ వృద్ధురాలు కనిపించకపోవడంతో ఆమె కోసం ఏలూరు కాలువలో పోలీసులు, అగ్నిమాపక అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాలివి.. స్థానిక జువ్వలపాలెంకు చెందిన రావి చంద్రావతి అనారోగ్యంగా ఉండడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య పరీక్షల అనంతరం ఆమెకు కేన్సర్ ఉందని రిపోర్టు వచ్చింది. ఈ మేరకు ఆమె మనోవేదనకు గురై సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంటి సమీపంలోని ఏలూరు కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈమేరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఏలూరుకాలువలో బోటుతో గాలింపు ముమ్మరంగా చేపట్టారు. ఈ మేరకు వృద్ధురాలి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

ఆలయంలో బంగారు ఆభరణాల చోరీ

కామవరపుకోట,ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):తడికలపూడిలోని గ్రామదేవత ఆలయమైన గంగానమ్మ, అంకాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు బద్దలు కొట్టి వెండి, బంగారు ఆభరణాలను అపహరించినట్టు ఆలయ నిర్వాహకులు తడికలపూడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ పి.చెన్నారావు ఏలూరు నుంచి డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌ను తీసుకువచ్చి సమగ్ర పరిశీలన చేశారు. వివరాలు తెలియాల్సి ఉంది.

పది మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- నలుగురికి మూడు రోజుల పాటు సేవలు చేయాలని ఆదేశం మరో ముగ్గురికి రూ.3 వేలు చొప్పున జరిమానా

ఏలూరు క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆదేశాలతో ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు వారి సిబ్బంది కలిసి ఈనెల 2వ తేదీన పాతబస్టాండ్ వద్ద స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన పది మందిపై కేసులు నమోదు చేశారు. వారిలో ఏడుగురికి రెండో తరగతి మేజిస్ట్రేట్ కోర్టుకు మంగళవారం హాజరుపరిచారు. వీరిలో నలుగురిని మూడు రోజుల పాటు సామాజిక సేవలు చేయాలని మేజిస్ట్రేట్ కేవీఆర్ మల్లేశ్వరి ఆదేశాలు జారీ చేశారు. మరో ముగ్గురికి ఒకొక్కరికి మూడు వేల రూపాయల చొప్పున జరిమానా విధించారు. మరో ముగ్గురిని కోర్టుకు హాజరు పర్చాల్సి ఉందన్నారు.

దారికి అడ్డుగా ఉన్నాడని ఒకరిపై దాడి.. కేసు నమోదు

ఏలూరు, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): రోడ్డుపై అడ్డుగా ఉన్నాడంటూ ఓ వ్యక్తిపై మరో వ్యక్తి దాడిచేసి గాయపరచిన ఘటన లింగపాలెం మండలం మఠంగూడెంలో జరిగింది. ఎస్ఐ కె.వెంకన్న తెలిపిన వివరాలివి.. మఠంగూడెం గ్రామానికి చెందిన ఎస్.నాగబాబు అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన జి.అశోక్ అనే వ్యక్తి దారిలో అడ్డుగా ఉన్నాడు. ఈ మేరకు అతడిపై దుర్భాషలాడుతూ ఎస్.నాగబాబు, ఎస్.భీమసేన అనే ఇద్దరూ అశోక్‌పై దాడి చేయడంతో అతడి తలకు తీవ్ర గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. బాధితుడు ఫిర్యాదు మేరకు నాగరాజుపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ సేవలపై అవగాహన ఉండాలి

టి.నర్సాపురం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ప్రభుత్వం అందించే సేవలపై అవగాహన కలిగి ఉండాలని బొర్రంపాలెం పంచాయతీ కార్యదర్శి పగడాల నాగేశ్వరరావు తెలిపారు. బొర్రంపాలెం గ్రామంలో మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌పై స్థానిక సచివాలయ సిబ్బందితో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల చేతిలో ప్రభుత్వం ఉందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చిందని, అందిస్తున్న 200 పైగా సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఘనంగా మంగళ గౌరీ వ్రతాలు

ఏలూరుకార్పొరేషన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి) : శ్రావణమాసంలోని రెండవ మంగళవారం కావడంతో నగరంలోని పలు డివిజన్లలోని అమ్మవారి ఆలయాల వద్ద మహిళలు సామూహికంగా మంగళగౌరీ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకారాలతో భక్తులకు దర్శనమిచ్చారు. సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని సంతానలక్ష్మీదేవిగా అలంకరించారు. బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ అమ్మవారికి సంతాన లక్ష్మీదేవిగా అలంకరించగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కలెక్టర్‌కు ఎంపీహెచ్‌ఏ ఉద్యోగుల ఫిర్యాదు

ఏలూరు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ డీఎస్సీ-2002 రిక్రూట్‌మెంట్‌లో జరిగిన ఎంపీహెచ్‌ఏ(మేల్) నియామకాల్లో ఉద్యోగాలు పొందిన వారిలో ఏడుగురు ఎస్సీ ఉద్యోగులను అన్యాయంగా తొలగించడంపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అభ్యర్థిస్తూ కలెక్టర్ వెట్రిసెల్వికి సంబంధిత బాధిత ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. స్థానిక మీడియాకు మంగళవారం విడుదల చేశారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో ఎస్సీ ఎగ్రెనిస్టు పోస్టుల్లో నియమితులైన ఎస్సీ ఉద్యోగులు ఏడుగురిని జీవో 273లో చేర్చి ఉద్యోగాల్లో కొనసాగించాలని ఉత్తర్వులున్నప్పటికీ, డీఎంహెచ్‌వో కార్యాలయంలో పని చేస్తున్న కొందరు జిల్లా అధికారులను తప్పుదారిపట్టిస్తున్నారని ఆరోపించారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా తమ పునర్నియామకం ఆలస్యమైందని గతంలో చెప్పిన డీఎంహెచ్‌వో కార్యాలయ అధికారులు, ఇటీవల జిల్లా డీఎస్సీలోనే నిర్ణయం తీసుకోవచ్చని రాష్ట్ర ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టరేట్ స్పష్టతనిచ్చినప్పటికీ తాత్సారం చేస్తున్నారని ఫిర్యాదులో వివరించారు. తాజా ఉత్తర్వుల ప్రకారం తమకు న్యాయం చేయాలని అభ్యర్థించారు. దీనిపై డీఎంహెచ్‌వో కార్యాలయ అధికార వర్గాలను వివరణకోరగా ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన రిక్రూట్‌మెంట్ విధివిధానాలపై సమగ్ర సమాచారం కోసం 15 రోజులుగా ప్రయత్నిస్తున్నామని, ఈ నియామకాలకు సంబంధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నోటిఫికేషన్‌పై తలెత్తిన వివాదాలు, వ్యాజ్యంపై గతేడాది డిసెంబరు 5న తెలంగాణ హైకోర్టు రెండు రాష్ట్రాల్లోను పలువురు ఉద్యోగులను టెర్మినేట్(తొలగింపు) చేయాలని తీర్పు చెప్పింది. ఈ క్రమంలో జిల్లాలో 112మంది ఎంపీహెచ్‌ఏ(మేల్) ఉద్యోగులను తొలగించాల్సి వచ్చింది. దీనిని సవాల్ చేస్తూ కొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించగా, కేసు పెండింగ్‌లో ఉంది. ఇక ఎగ్రెనిస్టు పోస్టుల్లో పనిచేస్తున్న ఉద్యోగులను జీవో 273 ఆర్డర్‌మేరకు కొనసాగించే విషయమై కలెక్టర్‌కు నివేదించి, రాష్ట్ర అధికారుల నిర్ణయం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని వివరించాయి.

యూరియా అందుబాటులో ఉంచాలి : చింతమనేని

పెదపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సొసైటీల ద్వారా రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులో ఉంచాలని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు చేపట్టాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొక్కిరపాడు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించగా, ఏఎంసీ ఛైర్మన్ గారపాటి రామసీతతో కలిసి గ్రామంలో పాదయాత్రగా వెళ్లి ఎమ్మెల్యే చింతమనేని స్థానిక సమస్యలడిగి తెలుసుకుని, కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించి కరపత్రాలను మహిళలకు అందజేశారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచితప్రయాణాన్ని ప్రభుత్వం అందించనుందన్నారు. గారపాటి శ్రీను, మోరు శ్రావణి, గుత్తా అనిల్, వేములపల్లి చంటిబాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నూతన రూల్స్‌పై ఎస్ఎఫ్ఐ అభ్యంతరం

ఏలూరు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లోకి విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు మినహా మిగతా అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సంఘ నగర శాఖ అధ్యక్షుడు శివాజీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, ప్రజాస్వామిక హక్కులను హరించేలా ఉన్నాయని ఆరోపించారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు ఇతరులు వెళ్లే అవకాశం ఉండదని అన్నారు. విద్యాసంస్థల్లో రాజకీయాలకు తావులేదని చెబుతున్న ప్రభుత్వం ఇటీవల మెగా పేరెంట్స్, టీచర్స్ మీట్‌లో పాఠశాలల్లో సమస్యలను చెప్పినవారిని ఎమ్మెల్యేలను, వారి అనుచరులు బెదిరించిన సంఘటనలున్నాయని ఆరోపించారు. విద్యాశాఖ జారీచేసిన ఉత్తర్వులను వెంటనే రద్దుచేసి, పాఠశాలల్లో ప్రజాస్వామిక వాతావరణం కొనసాగేలా చూడాలని డిమాండ్ చేసారు. సంఘ నాయకులు జయంత్, శివవర్ధన్, సాయి పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అధికారిపై విచారణ జరపాలి


వినతిపత్రం ఇస్తున్న దళిత సేన

ఏలూరుటూటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ విభాగంలో పని చేస్తున్న డీపీవో సాంబశివరావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షులు జె.రవిప్రకాశ్ జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవిప్రకాశ్ మాట్లాడుతూ నగరంలో నూతన కట్టడాలకు ప్లాన్ అప్రూవల్‌కు సంబంధించి నిబంధనలకు విరుద్ధంగా డీపీవో అనుమతులు మంజూరు చేస్తున్నారన్నారు.

పేదరికం పారిపోవాలి

(5వ పేజీ తరువాయి)

కూడా జరిగిపోయింది. ఉపాధ్యాయులకు పీ-4 కార్యక్రమ లక్ష్యాలను విధించడం ఏమాత్రం సరికాదని ఒక్కసారిగా నిరసనలు వెల్లువెత్తడంతో వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పీ-4 అమలులో మార్గదర్శకులు స్వచ్ఛందంగా వారంతట వారు మమేకం అయ్యేలా జాగ్రత్తలు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశించింది.

మార్గదర్శులు అత్యంత కీలకం : బంగారు కుటుంబాలను తీర్చిదిద్దడంలో వారిని దత్తత తీసుకునే మార్గదర్శులే అత్యంత కీలకం. జిల్లా వ్యాప్తంగా 99,905 బంగారు కుటుంబాలను గుర్తించగా ఇప్పటివరకు 54,945 మంది కుటుంబాలను దత్తత తీసుకున్నారు. దీని నిమిత్తం 6,429 మంది మార్గదర్శులు ముందుకు వచ్చారు. ఏలూరు నియోజకవర్గంలోనే అత్యధికంగా 1276 మంది మార్గదర్శులు ముందుకు రాగా, చింతలపూడిలో 1173, పోలవరంలో 1083, దెందులూరులో 831, కైకలూరులో 728, నూజివీడులో 591, ఉంగుటూరులో 539 మంది మార్గదర్శులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకోనున్నారు. వారంతా పేద కుటుంబాలను దత్తతకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. ఈ నెల మూడో వారం నుంచే కుదిరితే పీ- 4కు పూర్తిగా పదునుపెట్టాలని నిర్ణయించారు.

ప‘రేషన్’


(5వ పేజీ తరువాయి)

తరలించేటపుడు అధికారులు వారి రేషన్ కార్డుల్లో మార్పులు చేయకపోవడంతో కష్టాలు పడుతున్నారు. రేషన్ కష్టాలు తొలగించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను వేడుకుంటూనే ఉన్నారు. ఆగస్టు నెల రేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. పోచవరం రెవెన్యూ అధికారుల నుంచి నిర్వా సితులకు పిలుపు రాకుంటే రేషన్ బియ్యం రానట్లే. వర్షాలు, వరదలు కారణంగా ఇప్పటి వరకు నిర్వాసితులకు బియ్యం పిలుపు రాలేదు. పోచవరంలోని రేషన్‌కార్డులను ఆన్‌లైన్‌లో మార్పులు చేసి రామన్నగూడెం కాలనీలోనే రేషన్ బియ్యం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

నిర్వాసితుల రేషన్ కష్టాలపై తహసీల్దార్ పీవీ చలపతిరావు, సీఎస్ఆర్ఐ కె.పద్మను వివరణ కోరగా అందరి వివరాలు తీసుకున్నామని, డివిజన్, జిల్లా అధికారులకు నివేదిక పంపించామన్నారు. త్వరలోనే వారికి రామన్నగూడెంలోనే రేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వీఆర్ పురంలో ఆఫ్‌లైన్ విధానం ఉందని, బుట్టాయగూడెం మండలంలో ఆన్‌లైన్ విధానం కొనసాగుతున్నందున ఆలస్యం జరుగుతుందన్నారు. వీఆర్ పురం రెవెన్యూ అధికారులతో మాట్లాడామని, అన్ని కుటుంబాల కార్డులను మార్పుచేసి ఆన్‌లైన్ చేయడం ద్వారా రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలం అయినందున 3 నెలల రేషన్ వచ్చిందని త్వరలోనే ఇస్తామన్నారు.

రేషన్ బియ్యానికి వేల ఖర్చు



రేషన్ బియ్యానికి వేలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయి. పది మందికి పైగా కూలి పనులు మానుకుని వాహనాల్లో రేషన్ తెచ్చుకోవడం కష్టంగా ఉంటుంది. కార్డులు మార్పు చేయకపోవడంతో రేషన్‌తో పాటు ఇతర ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కారించాలి.

వేట్ల ముత్యాలరెడ్డి, కాలనీ నిర్వాసితుడు

రేషన్ బియ్యమే ఆధారం



ప్రభుత్వం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని వేలు ఖర్చుచేసి తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. అన్ని కుటుంబాలవారు రేషన్‌పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం బియ్యం కోసం వెళదామంటే వర్షాలు, వరదలు వస్తున్నాయి రావద్దంటున్నారు. రేషన్ కోసం వెళితే తిరిగోస్తామో లేదో తెలియదు. నిర్వాసిత కుటుంబాలకు వెంటనే రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలి.

అందెల సీతారామరెడ్డి, కాలనీ పెదకాపు

స్మార్ట్ మీటర్లు మాకొద్దు..

విద్యుత్ కార్యాలయాల వద్ద ప్రజా సంఘాలు, వామపక్షాల ఆందోళనలు

చింతలపూడి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు వద్దంటూ వామపక్ష పార్టీలు, ప్రజా సంఘ నాయకులు నిరసన తెలుపుతూ పాత బస్టాండ్‌లోని ఏడీ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు పి.సోమశేఖర్ మాట్లాడుతూ ఆదానీ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన నాటి ప్రభుత్వం తిరిగి ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ముందుగా బోసుబొమ్మ సెంటర్ నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా నినాదాలు చేస్తూ పాత బస్టాండ్ కార్యాలయం వరకు వెళ్లారు. వామపక్ష నాయకులు చంద్రశేఖరరెడ్డి, కంచర్ల గురవయ్య, దొంత కృష్ణ, షేక్ కాలేష, ఎం.వరలక్ష్మీ, సూర్య కుమార్ పాల్గొన్నారు.

● నిడమర్రు: సీఐటీయూ నాయకుడు నారపల్లి రమణారావు ఆధ్వర్యంలో మంగళవారం భువ్వనపల్లి సబ్‌స్టేషన్ వద్ద సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. నారపల్లి రమణారావు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు పీకేయాలని ఇప్పటి మంత్రి లోకేశ్ ప్రతిపక్షంలో ఉండగా పిలుపునిచ్చారని గుర్తు చేశారు. గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, వి.మోహన్, కానూరి రాజు పాల్గొని అధికారులకు వినతిపత్రం అందజేశారు.

● భీమడోలు: ప్రజా వేదిక ఆధ్వర్యంలో భీమడోలు ఏడీఏ కార్యాలయం ముందు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.అంగరాజు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోకపోతే ఈ నెల 28న మరో ఉద్యమానికి సిద్ధమవుతామన్నారు. కట్టా భాస్కరరావు, నాగరాజు, రాంబాబు పాల్గొన్నారు.

● ఏలూరు కార్పొరేషన్: ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో సీపీఐ, సీపీఎం, ఇఫ్టు, ఏఐటీయూసీ, సీపీఐ(ఎంఎల్) తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నాతో హోరెత్తించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వేదిక నాయకులు కార్యాలయంలో అందజేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయవద్దంటూ విజ్ఞప్తి చేశారు.

● బుట్టాయగూడెం: వామపక్షాలు, ప్రజాసంఘాలు, గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులు బుట్టాయగూడెం సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. నాయకులు ధర్మల సురేష్, తెల్లం రామకృష్ణ, బి.కిషోర్, టి.బాబురావు, వి.భారతి, కె.వీరాస్వామి, ఎస్.సుందరరావు పాల్గొని మాట్లాడుతూ ట్రూప్ ఆప్ చార్జీల పేరుతో గత 36 నెలలు నుంచి 3 వేల కోట్లను వసూలు చేస్తున్నారన్నారు. అనంతరం ఏఈ శ్రీనివాసవర్మకు వినతి పత్రం అందజేశారు.కె.పోతురెడ్డి, కె.జలపాలు, జి.రమేష్ బాబు, టి.ముత్యాలమ్మ, కె.సత్యన్నారాయణదొర, కె.లక్ష్మి, కె.గోవిందరాజు, గిరిజనులు పాల్గొన్నారు.

● వేలేరుపాడు: వామపక్ష పార్టీలు కాంగ్రెస్‌తో కలిసి వేలేరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించి ఆందోళన చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అంగీకరించేలా ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఆందోళన చేపడతామన్నారు.


కుక్కునూరులో నిరసన తెలియజేస్తున్న దృశ్యం

● జీలుగుమిల్లి: ప్రజా సంఘాల నేతలు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జీలుగుమిల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు మంగళవారం ర్యాలీగా వెళ్లి ధర్నా నిర్వహించారు. ప్రజా సంఘాల నాయకులు ఇ.భూషణం, కారం దారయ్యతెల్లం దుర్గారావు, కట్టం ముత్యాలరావు, కట్టం నాగేశ్వరావు, వీరంకి దుర్గారావు చిట్టిబొమ్మ కొండలరావు, సిరిబత్తుల సీతారామయ్య, నేలటూరి అప్పారావు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు సీపీఐ జిల్లా సమితి సభ్యులు పీఎస్.సాగర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వామపక్ష పార్టీల కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున ప్రదర్శనగా వెళ్లి టి.నర్సాపురం సబ్ స్టేషన్‌లో ఎలక్ట్రికల్ ఈఈ దాసరి శ్రీనివాస్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు గుడెల్లి వెంకట్రావు, జనశక్తి నాయకులు కారం భాస్కర్, సీపీఐ మండల కార్యదర్శి కొండముచ్చు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● కుక్కునూరు: స్థానిక సబ్‌స్టేషన్‌ను నాయకులు ముట్టడించి స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కొన్నే లక్ష్మయ్య, కూరాకుల బాబురావు, చోడే రాజేశ్, సోమరాజు, ఎస్‌కే.గౌస్, సత్యనారాయణ, గజ్జి రాజులు, వడ్డి రఘు పాల్గొన్నారు.


కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

నూతన అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి
తహసీల్దార్లకు జర్నలిస్టుల అర్జీలు

కొయ్యలగూడెం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ నాగరాజుకు కొయ్యలగూడెం వర్కింగ్ జర్నలిస్టులు వినతిపత్రం ఇచ్చారు.గత ప్రభుత్వం ఇచ్చిన అక్రిడిటేషన్ కార్డులు రెన్యూవల్ చేస్తున్నారే తప్ప కొత్తకార్డులు ఇవ్వడంలేదన్నారు. అలాగే వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు జారీ చేయాలని కోరారు. విలేకరులు ఎం.సాయిబాబా, కృష్ణబాబు, టీవీ-5 సాయిబాబా, హలీం, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: తహసీల్దార్ పూర్ణచంద్రప్రసాద్‌కు ఉంగుటూరు ప్రెస్ క్లబ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భుజంగరావు, కార్యదర్శి పివిసత్యనారాయణ, ఉపాధ్యక్షులు గత్తికొండ శ్రీనివాసరావు, పెద్దిరాజు, ఆజ్హాపాల్ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి జక్కుల దాసు ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పి.వి.చలపతిరావుకు అందజేశారు. జర్నలిస్టుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ తెలిపారు. జిల్లా కమిటీ మెంబరు కోడూరి ఆనంద్, సీనియర్ జర్నలిస్టు ఎం.శ్రీనివాసరావు, కె.క్రాంతికుమార్,ఎం.రమేష్, జి.మధుబాబు, ఎస్.కృష్ణమోహన్, పి.మురళి, ఫణి పాల్గొన్నారు.

● జీలుగుమిల్లి: జర్నలిస్టుల సమస్యల్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని జీలుగుమిల్లి తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్ అన్నారు.వర్కింగ్ జర్నలిస్టుల డిమాండ్ డే పురస్కరించుకుని మండలంలో ఏపీయూడబ్ల్యూజే జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు సమస్యలు తెలియజేస్తూ వినతిపత్రం అందజేసింది. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సభ్యులు కోలా రాము, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు నక్కా రవి, క్రొవ్విడి ప్రసాద్, పాముల ప్రసాద్, బొలగాని సత్యనారాయణ, మద్దిశెట్టి ఏసుబాబు, బొంతు రామారావు, బొంతు రామకృష్ణ, సోదెం పోశారావు, దాసరి మనోజ్, లక్ష్మణ్, సాయి, రాంబాబు, అంజనేయులు, ప్రదీప్ ఉన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలి

కామవరపుకోట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కామవరపుకోట మండల వ్యవసాయ శాఖాధికారి డి.ముత్యాలరావు ఆధ్వర్యంలో మంగళవారం తడికలపూడి ఆయిల్ పాం, కోకో తోటల వద్ద రైతులను సమావేశపరిచి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రకృతి సాగును ప్రోత్సహించాలని, తద్వారా రైతులకు ఎంతో ప్రయోజనమని, ఖర్చు తగ్గుతుందని, నాణ్యమైన ఉత్పత్తులు లభిస్తాయని, భూసారం పెరుగుతుందన్నారు. కషాయాల ద్వారా పురుగులను నియంత్రించవచ్చని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని ఆదరించి ప్రయోజనం పొందాలని వ్యవసాయాధికారి ముత్యాలరావు సూచించారు.

● కొయ్యలగూడెం: రైతులు యూరియా వినియోగం తగ్గించుకోవాలని దానికి బదులు జీవన ఎరువులు వాడుకోవాలని కేఆర్‌పురం ఏడీఏ బుజ్జిబాబు కోరారు. ఈ మేరకు మండలంలోని పొంగుటూరు అచ్యూతపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రతీ రైతు జీవన ఎరువులు ఉపయోగిస్తూ వ్యవసాయ శాఖాధికారుల సూచనలు పాటించాలని కోరారు. మండల వ్యవసాయ శాఖాధికారి పోశారావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● దెందులూరు: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందేలా ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలుసుకుంటూ ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవనశాఖ అధికారి బి.కరణ్, వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం చల్లచింతలపూడి, పెరుగుగూడెం గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహించారు. సాగులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. మాజీ సర్పంచ్ ముమ్మడి మోహన్‌రావు, మాజీ ఎంపీటీసీ నాగనబోయిన సత్యనారాయణ, పార్టీ గ్రామాధ్యక్షుడు వేమన రాము గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ పుసులూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో ఏర్పాటు చేయాలని వినతి



చింతలపూడి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన చింతలపూడిలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విజయరత్నంను అమరావతిలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మా ట్లాడుతూ చింతలపూడిలో బస్సు డిపో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, అందుకు అవసరమైన నాలుగు ఎకరాల స్థలం సిద్ధం చేసి ఇస్తామని చెప్పారు. డిపో ఏర్పాటు చే యడం ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వెయ్యి మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. అంతేకాక రాష్ట్ర సరిహద్దులో మారుమూలగా ఉన్న చింతలపూడిలో డిపో లేకపోవడంతో ప్రయాణికులకు సరైన బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, ఇతర డిపోలు సక్రమంగా బస్సులు తిప్పకపోవడం, అనేక గ్రామాలకు బస్సులు లేకపోవడం, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ వసతి కలగాలని, దీనికి అవసరమైన సౌకర్యాలకు తాము సహకరిస్తామని తెలిపారు.

రెండు సొసైటీలకు ఉత్తమ అవార్డులు


అవార్డులు అందజేస్తున్న అచ్చెన్నాయుడు

పెదపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):ఖాతాదారులకు నాణ్యమైన సేవలు, ఉత్తమ వ్యాపార లావాదేవీలు నిర్వహించినందుకు పెదపాడు మండలం గోగుంట సొసైటీ 2024 సంవత్సరానికి, పెదపాడు సొసైటీ 2025 సంవత్సరానికి ఉత్తమ ప్రతిభ అవార్డులను రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా అందుకున్నట్టు ఆయా సొసైటీల సీఈవోలు డీవీ సుబ్బారావు, జయమంగళ రామారావులు తెలిపారు. సోమవారం విజయవాడలో జరిగిన ఆప్కాబ్ 62వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంత్రి అచ్చెన్నాయుడు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఆప్కాబ్ ఎం.డి. డాక్టరు ఆర్.శ్రీనాథరెడ్డి చేతుల మీదగా ఈ అవార్డులను అందుకున్నారు. అవార్డుతో పాటుగా రూ.20 వేలు ప్రోత్సాహక నగదును ఎఫ్.డి. రూపంలో అందజేశారని సుబ్బారావు చెప్పారు. రూ.35 కోట్ల టర్నోవర్‌తో ఏ గ్రేడ్ లాభాలతో పెదపాడు సొసైటీ ఖాతాదారులకు సేవలందిస్తుందని, గతంలో ఎన్.సి.డి.సి అవార్డును అప్పటి సొసైటీ అధ్యక్షులు గారపాటి స్టాలిన్ అందుకున్నారన్నారు. పెదపాడు, గోగుంట సొసైటీల ఇంఛార్జి అధికారి, సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎ.కె.ఎన్.ఎన్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.


మొక్క ఇచ్చి స్వాగతం పలుకుతున్న దృశ్యం

నూతన ఎంఈవోకు స్వాగతసత్కారం

ద్వారకాతిరుమల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల ఎంఈవో-1గా ఎం.సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గోపన్నపాలెం నుంచి ఇక్కడకు వచ్చారు. ఈమేరకు యనకు యూటీఎఫ్ నేతలు, ఉపాధ్యాయులు ఘనస్వాగతం పలికారు.

అంగన్వాడీలపై వేధింపులు మానుకోండి

కుక్కునూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పని చేయని ఫోన్లు అప్పగించిన అంగన్వాడీలపై అధికారులు వేధింపులు మానుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.సాయికిరణ్ పేర్కొన్నారు. ఏడేళ్ల క్రితం ప్రభుత్వం ఇచ్చిన ఫోన్లు పని చేయకపోవడంతో సోమవారం ఆ ఫోన్లను అంగన్వాడీలు ఐసీడీఎస్ కార్యాలయంలో అప్పగించారన్నారు. సిగ్నల్స్ లేక పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా వాటిని తిరిగి అప్పగించినట్టు తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

ఏలూరుటూటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కార యజ్ఞం ఏడాది కాలంగా నిరాటంకంగా కొనసాగుతోందన్నారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం : సీపీఐ

వేలేరుపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆరోపించారు. మంగళవారం ఆ పార్టీ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పెదవాగు ప్రాజెక్టు తెగిపోయి ఏడాది అవుతున్న నేటి వరకు మరమ్మతులు చేయలేదన్నారు.జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎండీ మున్నీర్, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల కార్యదర్శులు బాడిస రాము, పొన్నే లక్ష్మయ్య, జిల్లా నాయకులు సాయిబాబు, పిట్టా ప్రసాద్ పాల్గొన్నారు.

క్రమ శిక్షణతో విద్యనభ్యసించండి


అవగాహనకల్పిస్తున్న సీఐ సత్యనారాయణ

ఏలూరు క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యార్థి దశలోనే కష్టపడి క్రమ శిక్షణతో విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ అన్నారు. సీఐ జి.సత్యనారాయణ, ఎస్ఐ మదీనాబాషా, శక్తి టీమ్ సభ్యులు కలిసి ఏలూరు శ్రీ కృష్ణదేవరాయ స్కూల్లో విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ మీడియా ద్వారా ఎదురయ్యే మోసాలపై అవగాహన అవసరమన్నారు. అత్యవసర సమయాల్లో పోలీసుల సహాయం కోసం 112కు కాల్ చేయాలని సీఐ చిన్నారులకు సూచించారు.

జ్వరంతో చిన్నారి మృతిపై అధికారుల విచారణ


చిన్నారి కుటుంబంతో మాట్లాడుతున్న దృశ్యం

కుక్కునూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చీరవల్లి గ్రామంలో సహస్ర అనే చిన్నారి జ్వరంతో మృతి చెందడంపై వైద్య బృందం మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. కేఆర్.పురం ఐటీడీఏ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సురేశ్ కుమార్, జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ ఇతర వైద్య సిబ్బంది బాధిత చిన్నారి కుటుంబాన్ని ముందుగా పరామర్శించారు. అనంతరం తల్లిదండ్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ-పంట నమోదు చేసుకోవాలి

చింతలపూడి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్‌కు అర్హులైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ఈ-పంటలో నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు వై.సుబ్బారావు సూచించారు. మండలంలోని ఎర్రంపల్లి, తిమ్మిరెడ్డిపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాల న్నారు. మండల వ్యవ సాయ అధికారి జి.మురళీకృష్ణ, ఉద్యానవన శాఖ అధికా రిణి ఎం.డి.షాఫియా, రైతులు పాల్గొన్నారు.

అప్పనవీడులో అన్నదానం

పెదపాడు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో ప్రసిద్ధి చెందిన అభయాంజనేయస్వామి దేవాలయం వద్ద హనుమాన్‌జంక్షన్‌కు చెందిన యిమ్మడి శేఖర్‌బాబు ఆర్థిక సహకారంతో సుమారు 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్లుగా ఆలయ ఛైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. దేవాలయం వద్ద భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పరుగుపందెంలో ప్రతిభ

ఉంగుటూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం సరిపల్లె గ్రామానికి చెందిన అఖిల్ శ్రీవర్మ అండర్ - 16 పరుగు పందెంలో తన ప్రతిభను చాటాడు. 60 మీటర్లు పరుగులో కేవలం 7.5 సెకన్లలో పూర్తి చేయగా, 80 మీటర్ల పరుగులో 10.64 సెకన్లలో పూర్తి చేసి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ విజయాలపై మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అఖిల్ శ్రీవర్మను ఎమ్మెల్యే ధర్మరాజు ప్రత్యేకంగా అభినందించారు.

భారీ కొండచిలువ హతం



కామవరపుకోట, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం ఉదయం కొండ చిలువ హల్ చల్ చేయడంతో కొందరు భయంతో పరుగులు తీశారు. మరికొందరు ధైర్యం చేసి ఆ కొండ చిలువను హతమార్చారు. దీంతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు అందరిలో ఆందోళన తలెత్తింది.

ఉచిత నేత్ర పరీక్షలు

ఏలూరుటూటౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నేత్రాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ రవికిరణ్ అన్నారు. చొదిమెళ్ల గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో నేత్రాలకు శుక్లపరీక్షలు, రెటీన చికిత్సలు, ఇతర కంటి సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారపుపేట కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు కోనేరు వంశీకృష్ణ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ఎటువంటి వైద్య సేవలు అవసరమొచ్చిన అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. డివిజన్ ఇన్‌చార్జ్ యడ్లపల్లి శివ మాట్లాడుతూ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన వారికి డాక్టర్ హేమలత కళ్లజోళ్లు, మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

సుపరిపాలనలో తొలి అడుగు ప్రచారం

చింతలపూడి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని మారుతీ నగర్‌లో టీడీపీ నాయకులు సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీ ఇంటికీ వెళ్ళి ప్రభుత్వం చేపట్టే పథకాలు వివరించారు. ఆ పథకాలు గృహాల్లో వారికి ఏం అందుతున్నాయో నమోదు చేశారు. కొత్తపూడి శేషగిరిరావు, కంభం రమేష్, కె.చందు పాల్గొన్నారు. నగర పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నత్తనడకగా సాగుతుందని, దీనిని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ సూచించారు.


డ్రోన్ ఎగరేస్తున్న పోలీసులు

మందుబాబులపై డ్రోన్ నిఘా

ద్వారకాతిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో భాగంగా గ్రామాల్లో డ్రోన్ సాయంతో నిఘా ఏర్పాటు చేసినట్టు భీమడోలు సీఐ యూజా విల్సన్ తెలిపారు. ద్వారకాతిరుమల మండలంలోని మారుమూల ప్రాంతాల్లో మంగళవారం పోలీసులు డ్రోన్ కెమేరాల సాయంతో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్నవారిపై నిఘా పెట్టినట్టు పోలీసులు తెలిపారు.

తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన

ఏలూరు అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాల అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించినట్టు సీడీపీవో పద్మావతి,వైద్యాధికారి గౌతమ్ రాజ్ తెలిపారు. హెల్త్ విజిటర్ ర్యూన్సీ, ఏఎస్ఎంలు పి.హైమావతి, అన్నపూర్ణ, మంగమ్మ, నాగమణి, సీయోనుకుమారి పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-1లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీడీపీవో యు.వి. పద్మావతి మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఎంతో ముఖ్యమన్నారు. మొదటి టీకాగాను, వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని, బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు పూర్తిగా తల్లిపాలను ఇవ్వాలన్నారు. సూపర్‌వైజర్ కె.ర్యూన్సీ, టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

● దెందులూరు: మండలంలోని దోసపాడు అంగన్వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలల్లో భాగంగా పోతునూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పీడీ శారద మాట్లాడుతూ బిడ్డకు మొదటి టీకా, తల్లిపాల ప్రాధాన్యతను వివరించారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ

చాట్రాయి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో మంగళవారం వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ 'ప్రజల చేతిలో ప్రభుత్వం' పేరిట ప్రభుత్వానికి సంబంధించిన 200 పైగా సేవలను ప్రజలు వాట్సాప్ ద్వారా పొందవచ్చునని, ఏ పని కావాల్సినా ఇంటి దగ్గర నుంచే సెల్‌ఫోన్ వాట్సాప్‌లో అర్జీ పెడితే సర్టిఫికెట్ వచ్చేస్తుందని దీని వల్ల సమయం, ఖర్చు ఆదా అవుతుందని, అవినీతికి తావు ఉండదని అన్నారు. ర్యాలీలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చాట్రాయి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ పెద్ద లైన్ల మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు చాట్రాయి, బూరుగుగూడెం గ్రామాలలో త్రీఫేజ్ కరెంట్, చాట్రాయి టౌన్‌లో గృహ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సంజయ్ తెలిపారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, ప్రజలు సహకరించాలని ఏఈ విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ ఆస్తులను ధారాదత్తం చేస్తే ఊరుకోం

ఈయూ రీజనల్ కార్యదర్శి రాంబాబు హెచ్చరిక

ఏలూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):ప్రజారవాణా(ఆర్టీసీ) ఆస్తులను ప్రైవేట్ వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేస్తే ఊరుకునేది లేదని, ఐక్యంగా ఉద్యమిస్తామని ఎంప్లాయిస్ యూనియన్(ఈయూ) రీజనల్ కార్యదర్శి బి.రాంబాబు అన్నారు. ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరులోని కపర్థీ భవన్‌లోని ఈయూ కార్యాలయంలో మంగళ వారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న ఏపీఎస్ ఆర్టీసీ గవర్నర్‌పేట డిపోలు, పాతబస్టాండ్‌కు సంబంధించిన 15 ఎకరాలు కలిపి రూ.400 కోట్ల విలువైన స్థలం లులూ షాపింగ్‌మాల్‌కు ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తోందన్నారు. ఈ రెండు డిపోల పరిధిలో 1,100 మంది ఉద్యో గులను ప్రజలకు దూరం చేయాలన్న కుట్రలను భగ్నం చేస్తా మన్నారు. వెంటనే స్థలం కేటాయింపు జీవో 137 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గతంలో ఈ ప్రభుత్వ పెద్దలే 2014లో విజ యవాడ ఆర్టీసీ ట్రైనింగ్ కళాశాల స్థలం 29 ఎకరాలను హెచ్‌ఈఎల్ కంపెనీకి కట్టబెట్టారని, అందుకు బదులుగా ప్రభుత్వం ఇస్తామన్న స్థలం ఇప్పటివరకు ఒక్క గజం ఇవ్వలేదని గుర్తుచేశారు. ఆర్టీసీని కాపాడుకునేందుకు ఏ పోరాటాలకైనా సిద్ధంగా ఉంటామని తెలిపా రు. కేవీ రాఘవులు, వై.శ్రీనివాస్, టి.అంజనేయులు, టి.బాబూరావు, పాండు, నూజివీడు సెక్రటరీ కుమార్ పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా

నూజివీడు టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పింఛన్లు పొందటంలో ఇబ్బందులు తలెత్తకుండా విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని, ఏటీవో చంద్రయ్య అన్నారు. ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని, జిల్లా స్థాయిలో ఉన్న వాటి పరిష్కారానికి సహకరిస్తామన్నారు. ఎస్‌టీవో రాణి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు గోవిందరావు, అసోసియేట్ అధ్యక్షులు ఈమని శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

చేపల చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేస్తే చర్యలు

కలిదిండి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చేపల చెరువుల్లో కోళ్ల, రొయ్యల వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల మత్స్యశాఖాధికారి రవికుమార్ అన్నారు. మంగళవారం మట్టగుంట, కొండంగి గ్రామాల్లో పొలం పిలుస్తోందిలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పండుగప్ప చెరువుల్లో రొయ్యల వ్యర్థాలు వేయటంతో రెడ్ డిసీజ్ సోకి చేపలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. ఫంగస్ చెరువుల్లో కోళ్ల వ్యర్థాలు వేయటం వల్ల నీరు కలుషితమై ఫంగస్ చేపలకు వ్యాధులు సోకి మృత్యువాత పడుతున్నా యన్నారు. చేపల చెరువుల్లో సహజ సిద్ధమైన ఆహారం వేయాల న్నారు. రొయ్యల వ్యర్థాలతో రొయ్యల సాగుకు ముప్పు వాటిల్లుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయంతో రైతులకు లాభాలు

చాట్రాయి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులు అనుసరిస్తే రైతులకు మంచి లాభాలు వస్తాయని ఏవో బి.శివశంకర్ అన్నారు. మండలంలోని చిత్తపూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో కలిసి వరి పొలాలను పరిశీలించారు. డ్రోన్‌తో పురుగు మందుల పిచికారీ, వ్యవసాయ యాంత్రీకరణ, మల్చింగ్, డ్రిప్‌తో ప్రయోజనాలు, సబ్సిడీలపై ఏవో రైతులకు వివరించారు. రైతులు కాంప్లెక్స్ ఎరువులు, కలుపు మందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. మాజీ సర్పంచ్ కొత్తపల్లి రామదాసు పాల్గొన్నారు.

రైతుల కోసమే 'సేఫ్ మ్యాక్ సొసైటీ'



మాట్లాడుతున్న సీఈవో చంద్

నూజివీడు టౌన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): చిన్న, సన్న కారు రైతులను ప్రోత్సహించా లనే లక్ష్యంతో సేఫ్ మ్యాక్ సొసైటీ లిమిటెడ్ 10వ బ్రాంచ్‌ను ప్రారంభించినట్టు సొసైటీ సీఈవో కేటీ చంద్ అన్నారు. మంగళవారం నూజి వీడులో బ్రాంచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు వారంలో ఆరు రోజులు పని దినాలుగా వినియోగదారుల సేవలో ఉండనున్నట్లు తెలిపారు. చిన్న, సన్న కారు రైతులతో పాటు చిరు వ్యాపారులకు గ్యారెంటీ లేకుండా లక్ష రూపాయల వరకు రుణ సదుపాయం కల్పించటం జరుగుతుందన్నారు. ఇతర బ్యాంకులకు భిన్నంగా ఖాళీ స్థలాలపై రుణాలు, డిపాజిట్లపై 9 నుంచి 9.25 శాతం వడ్డీని ఇస్తామన్నారు. సమావేశంలో బ్రాంచ్ మేనేజరు సీహెచ్‌డీ కిరణ్, మార్కెటింగ్ హెడ్ ఎస్.వంశీ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందాలి : కామినేని



కొండాకు ఎమ్మెల్యే అభినందన

కైకలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): సొసై టీల అభివృద్ధితో రైతులకు మెరు గైన సేవలు అందా లని ఎమ్మెల్యే డాక్టర్ కామి నేని శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వరహాప ట్నంలో ఇటీవల వేమవరప్పాడు గ్రామ పీఏసీఎస్ అధ్యక్షుడిగా ఎన్నికైన నున్న కొండాను అభినందించా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సొసైటీల ద్వారా రైతులకు అన్నిరకాలు సేవలు అందేలా చూడాలని సూచించారు. గ్రామస్థులు బోయిన గోవర్ధన, బి. వసంతరావు, బోడావుల జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆలయ నిర్మాణాలకు చెక్కుల పంపిణీ

నూతన ఆలయ నిర్మాణం కోసం దేవదాయ, ధర్మదాయశాఖ నుంచి మంజూరైన రూ.10 లక్షల చెక్కును ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అందజేశారు. కలిదిండి మండలం చిన్నతాడినాడ శివారు పల్లిపాలెంలో దుర్గమ్మ ఆలయ నిర్మాణం కోసం ఎండోమెంట్‌కు ప్రతిపాదన చేయగా రూ.10 లక్షలు మంజూరు చేయడంతో చెక్కును ఎమ్మెల్యే గ్రామస్థులకు అందజేశారు. అలాగే ఆలయ ధూప దీప నైవేద్యాల కోసం రూ.10 వేలు మంజూరైనట్లు తెలిపారు. మండవల్లి గ్రామంలో రామాలయం పునఃనిర్మాణం కోసం మంజూరైన రూ.5.50 లక్షలు చెక్కును ఎమ్మెల్యే గ్రామస్థులకు అందజేశారు.

పేదరికం పారిపోవాలి

(5వ పేజీ తరువాయి)

కూడా జరిగిపోయింది. ఉపాధ్యాయులకు పీ-4 కార్యక్రమ లక్ష్యాలను విధించడం ఏ మాత్రం సరికాదని ఒక్కసారిగా నిరసనలు వెల్లువెత్తడంతో వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. ఈ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని పీ-4 అమలులో మార్గదర్శకులు స్వచ్ఛందంగా వారంతట వారు మమేకం అయ్యేలా జాగ్రత్తలు తీసుకునేలా ప్రభుత్వం ఆదేశించింది.

మార్గదర్శి.. అత్యంత కీలకం

బంగారు కుటుంబాలను తీర్చిదిద్దడంలో వారిని దత్తత తీసుకునే మార్గదర్శులే అత్యంత కీలకం. జిల్లా వ్యాప్తంగా 99,905 బంగారు కుటుంబాలను గుర్తించగా ఇప్పటి వరకు 54,945 మంది కుటుంబాలను దత్తత తీసుకున్నారు. దీని నిమిత్తం 6,429 మంది మార్గదర్శులు ముందుకు వచ్చారు. ఏలూరు నియోజకవర్గంలోనే అత్యధికంగా 1276 మంది మార్గదర్శులు ముందుకు రాగా, చింతలపూడిలో 1173, పోలవరంలో 1083, దెందులూరులో 831, కైకలూరులో 728, నూజివీడులో 591, ఉంగుటూరులో 539 మంది మార్గదర్శులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈ నెల మూడో వారం నుంచే కుదిరితే పీ- 4కు పూర్తిగా పదునుపెట్టాలని నిర్ణయించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	





నూజివీడు సబ్‌స్టేషన్, ముసునూరులో వామపక్షాల నాయకుల ఆందోళన



కలిదిండి సబ్ స్టేషన్ వద్ద ధర్నా

స్మార్ట్ నిరసనలు

స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దుచేయాలని ప్రజా సంఘాల ఆందోళన

నూజివీడు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ భారాలను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా నూజివీడు సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ, సీపీఎం పార్టీలు ధర్నా నిర్వహించాయి. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ప్రజలు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ వైసీపీ 9 సార్లు కరెంటు ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపితే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వ నేతలు ఇప్పుడు స్మార్ట్ మీటర్లను బిగిస్తూ విద్యుత్ ఛార్జీలను భారీగా పెంచుతున్నారని విమర్శించారు. సీపీఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు, వామపక్ష నాయకులు పాల్గొన్నారు.

ముసునూరు: విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారాన్ని మోపవద్దని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు చలసాని వెంకట రామారావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ముసునూరు మెయిన్ సెంటర్‌లో వామపక్షాల నాయకులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసీపీ ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లకు ఒప్పందాలు చేసుకుని, అదాని సంస్థకు టెండర్లను కట్టపెట్టి, భారీ కుంభకోణానికి పాల్పడిందని ఆరోపించారు. తక్షణమే ప్రభుత్వం అదానీ స్మార్ట్‌మీటర్లు, సోలార్ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని, ఇళ్లకు స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని నిలుపుదల చేసి, పాత మీటర్లను కొనసాగిస్తూ, పాత రీడింగ్ పద్ధతినే అమలు చేయాలని, సర్దుబాటు చార్జీలను పూర్తిగా రద్దు చేసి, బిల్లులను తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ట్రాన్స్‌కో లైన్‌మన్ శ్రీరాములనాయుడుకి వినతిపత్రం అందజేశారు. సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

చాట్రాయి: పెంచిన విద్యుత్, ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం చాట్రాయి సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగన్ అదానీ, సెకీ ఒప్పందం తక్షణం రద్దు చెయ్యాలని, ఈ ఒప్పందంలో రూ. 1750 కోట్లు అవినీతి జరిగిందని సాక్షాత్తు అమెరికా కోర్టు వెల్లడించినా, ప్రధాని ఒత్తిడి మేరకే సీఎం చంద్రబాబు సెకీ ఒప్పందాన్ని రద్దు చేసుకోవటం లేదని ఆరోపించారు. సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్, సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ, ఈవి శ్రీనివాస్, కొమ్ము ఆనందం, వామపక్ష నాయకులు దుర్గం పుల్లారావు, చాగంటి రాజారావు, గజవల్లి వెంకటేశ్వరరావు చాట్ల బాబూరావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: విద్యుత్ స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి చాకిరి శివ నాగరాజు డిమాండ్ చేశారు. మంగళ వారం ఆగిరిపల్లిలో ధర్నా నిర్వహించారు. కార్యదర్శి బాషా, మండల కమిటీ సభ్యులు ముత్యాల నరేష్, ఎన్. నవీన్, కిరణ్‌కుమార్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: స్మార్ట్ మీటర్లు, ట్రూ అప్ ఛార్జీలను రద్దుచేయాలని ప్రజా సంఘాల నాయకులు మంగళ వారం కలిదిండి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి గ్రామాల్లో ప్రజల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్ రామకృష్ణకు సమర్పించా రు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు మాట్లాడుతూ సక్రమంగా పని చేస్తున్న విద్యుత్ మీటర్లను తొలగించి అదాని విద్యుత్ ప్రిపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించి వాటి ధరను వినియోగదారులపై మోపటం అన్యాయమన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి జక్కుల మహేష్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు



ఆగిరిపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామికి శ్రావణ మాస పవిత్రోత్సవాలు ఆలయ ఈఓ సీహెచ్ సాయి పర్యవేక్షణలో నిర్వహించారు. మంగళవారం ఏకాదశి సందర్భంగా ఉదయం ఆలయ అర్చకులు వేదాంత శేషుబాబు, జి. అనంతకృష్ణలు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, హోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివార్లకు విశేష అర్చన, సర్వదైవత్య శాంతి హోమం, చతుర్వేద పారాయణం, ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

డ్రోన్ కెమెరాతో నిఘా



ఆగిరిపల్లి, ఆగస్టు 5, (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ శుభశేఖర్ అన్నారు. నూజివీడు రూరల్ ఇన్స్పెక్టర్ కె రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ శుభశేఖర్ సిబ్బందితో ఈదర గ్రామంలో మారుమూల ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలను డ్రోన్ కెమెరాల సహాయంతో పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ సారా తయారీ కేంద్రాలు, అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

హామీల అమలేదీ : మేకా

చాట్రాయి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు విమర్శించారు. మండలంలోని నరసింహారావుపాలెంలో మంగళవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డ పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ. 1500 ఇస్తామని హామీ ఇచ్చి అమలు చెయ్యలేదని, ఉచిత వంట గ్యాస్ ఒక నెల ఇచ్చి ఆపేశారని, నిరుద్యోగ భృతి ఊసే లేదని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ మాజీ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు చెలికాని బాబ్జీ, పరసా చెన్నారావు, మాదల నరసింహారావు, వంకిణి వెంకటేశ్వరరావు, మోరంపూడి నాగేశ్వరరావు వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ విమర్శలు అర్థరహితం

చాట్రాయి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై చేస్తున్న విమర్శలు అర్థరహితమని టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి తల్లాడ శ్రీనివాసరావు విమర్శించారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసినా సీఎం చంద్రబాబు తన పాలనా దక్షతతో ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు ఒక్కొక్కటీ అమలు చేస్తున్నారని అన్నారు. పెన్షన్ రూ. 4 వేలకు పెంపు, తల్లికి వందనం పథకంలో ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ. 13 వేలు చొప్పున ఇవ్వటం జరిగిందని, అన్నదాతా సుఖీభవ కింద మొదటి విడత ప్రతి రైతుకు రూ. 7 వేలు అందించారని, మహిళలకు ఉచిత బస్సు పథకం ఈ నెల 15 నుంచి ప్రారంభిస్తున్నారని, ఇవేవీ వైసీపీ నాయకులకు కనిపించడం లేదా అని దుయ్యబట్టారు. కువిమర్శలు మానుకోవాలన్నారు.

నాన్ నోటిఫైడ్ కాల్వలను నోటిపై చేయండి



మంత్రి రామానాయుడును కలసిన చేవూరు నీటి సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు

ముదినేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నాన్ నోటిఫైడ్ పంట కాల్వలను నోటిపై చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ముదినేపల్లి మండలం చేవూరు నీటి సంఘం అధ్యక్షుడు శాయిన ప్రసాదరావు కోరారు. మంగళవారం కతరం ఇరిగేషన్ లాకులను పరిశీలించేందుకు వచ్చిన మంత్రిని కలసి ముదినేపల్లి మండలంలో నాన్ నోటిఫైడ్ పంట కాల్వలు చాలా ఉన్నాయని వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం వల్ల నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రసాదరావు మంత్రికి వివరించారు. నోటిఫైడ్ కాల్వల తవ్వకాలకు, గుర్రపుడెక్క తొలగింపు పనులకు నిధులు మంజూరవుతున్నాయని చెబుతూ నాన్ నోటిఫైడ్ పంట కాల్వలను గుర్తించి నోటిపై చేయాలని కోరారు. ఈ విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి రామానాయుడు హామీ ఇచ్చారు. క్యాంప్ బెల్ కెనాల్ గట్టు కూరాడ నుంచి నాలుగైదు కిలోమీటర్ల దూరంలో బలహీనంగా ఉన్నాయని రిటైనింగ్ వాల్‌ను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కూడా కోరినట్లు ప్రసాదరావు తెలిపారు. పంటకాల్వల్లో గుర్రపుడెక్క తొలగింపు పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరామన్నారు.

ప'రేషన్'

(5వ పేజీ తరువాయి)

తరలించేటపుడు అధికారులు వారి రేషన్ కార్డుల్లో మార్పులు చేయకపోవడంతో కష్టాలు పడుతున్నారు. రేషన్ కష్టాలు తొలగించాలని ప్రజా ప్రతినిధులను, అధికారులను వేడుకుంటూనే ఉన్నారు. ఆగస్టు నెల రేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. పోచవరం రెవెన్యూ అధికారుల నుంచి నిర్వా సితులకు పిలుపు రాకుంటే రేషన్ బియ్యం రానట్లే. వర్షాలు, వరదలు కారణంగా ఇప్పటి వరకు నిర్వాసితులకు బియ్యం పిలుపు రాలేదు. పోచవరంలోని రేషన్‌కార్డులను ఆన్ లైన్‌లో మార్పులు చేసి రామన్నగూడెం కాలనీలోనే రేషన్‌బియ్యం ఇచ్చేలా చూడాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం

నిర్వాసితుల రేషన్ కష్టాలపై తహసీల్దార్ వీవీ చలపతిరావు, సీఎస్ఆర్ఐ కె.పద్మను వివరణ కోరగా అందరి వివరాలు తీసుకున్నామని, డివిజన్, జిల్లా అధికారులకు నివేదిక పంపించామన్నారు. త్వరలోనే వారికి రామన్నగూడెంలోనే రేషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వీఆర్ పురంలో ఆఫ్‌లైన్ విధానం ఉందని, బుట్టాయగూడెం మండలంలో ఆన్‌లైన్ విధానం కొనసాగుతున్నందున ఆలస్యం జరుగుతుందన్నారు. వీఆర్‌పురం రెవెన్యూ అధికారులతో మాట్లాడామని, అన్ని కుటుంబాల కార్డులను మార్పుచేసి ఆన్‌లైన్ చేయడం ద్వారా రేషన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలం అయినందున 3 నెలల రేషన్ వచ్చిందని త్వరలోనే ఇస్తామన్నారు.

రేషన్ బియ్యానికి వేల ఖర్చు



రేషన్ బియ్యానికి వేలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయి. పది మందికి పైగా కూలి పనులు మానుకుని వాహనాల్లో రేషన్ తెచ్చుకోవడం కష్టంగా ఉంటుంది. కార్డులు మార్పు చేయకపోవడంతో రేషన్‌తోపాటు ఇతర ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కారించాలి.

-వేట్ల ముత్యాలరెడ్డి, కాలనీ నిర్వాసితుడు

రేషన్ బియ్యమే ఆధారం



ప్రభుత్వ ఇచ్చే ఉచిత బియ్యాన్ని వేలు ఖర్చుచేసి తెచ్చుకునే పరిస్థితి నెల కొంది. అన్ని కుటుంబాల వారు రేషన్‌పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం బియ్యం కోసం వెళదామంటే వర్షాలు, వరదలు వస్తున్నాయి రావద్దంటున్నారు. రేషన్ కోసం వెళితే తిరిగోస్తామో లేదో తెలియదు. నిర్వాసిత కుటుంబాలకు వెంటనే రేషన్ అందేలా చూడాలి.

-అందెల సీతారామరెడ్డి, కాలనీ పెదకాపు

తీరనున్న మురుగునీటి కష్టాలు

పైప్‌లైన్ నిర్మాణంతో 15 ఏళ్ల నాటి సమస్యకు పరిష్కారం



నూజివీడు పెద్దచెరువు కళంగి వద్ద ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్లు

నూజివీడు టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణానికి 15 ఏళ్లుగా తలనొప్పిగా మారిన ట్రిపుల్ ఐటీ మురుగునీటి సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభిస్తోంది. 2008లో ఆర్జీయూకేటీ పరిధిలో నూజివీడు ట్రిపుల్ ఐటీని ఏర్పాటు చేశారు. ఇక్కడ ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ ను రెసిడెన్షియల్ విధానంలో 6,600మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా వారికి బోధనా, బోధనేతర సిబ్బంది మరో 1500 వరకు ఉంటారు. వీరు నిత్యం వినియోగించే నీటిని తరలించేందుకు ఎటువంటి వ్యవస్థ లేకపోవడంతో ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలోనే ఎస్‌టీపీ యూనిట్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి ట్యాంకర్ లారీల ద్వారా మురుగునీటిని తరలిస్తున్నారు. అయితే వర్షాకాలంలో వర్షాలకు ఈ మురుగునీరు తోడవడంతో నూజివీడు పట్టణంలోని గొడుగువారిగూడెం, గాంధీనగర్ ప్రాంతాలు ప్రతి ఏటా ముంపునకు గురవడం, స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవ్వడం ప్రతి ఏటా రివాజుగా మారింది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ మురుగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో సుమారు ఐదు కిలోమీటర్ల మేర పైప్‌లైన్ వేసి మురుగునీటి తరలింపునకు నూజివీడు పెద్దచెరువు కళంగి వరకు ప్రత్యేకంగా పైప్‌లైన్ నిర్మాణాన్ని చేపట్టారు. ఏప్రిల్ నెలలో ఇది ప్రారంభమైంది. దాదా పు 80 శాతం పనులు పూర్తయ్యాయి. 2008 నుంచి ఇప్పటి వరకు కోట్లాది రూపాయలు వెచ్చించి మురుగు నీటిని ట్యాంకర్ల ద్వారా తరలించాల్సిన పరిస్థితికి రాజకీయ చొరవ లేకపోవడమే ప్రధాన కారణం. ట్రిపుల్ ఐటీ నుంచి ఓపెన్ డ్రెయిన్ ద్వారా పెద్ద చెరువుకు మురుగునీటిని తరలించేందుకు తొలుత ప్రయత్నాలు సాగినా గాంధీనగర్ వాసుల నుంచి వ్యతిరేఖత వ్యక్తమవ్వడంతో ఆ పనులకు బ్రేక్ పడింది. అనంతరం రూ. 3.75కోట్లతో పైప్‌లైన్ నిర్మించేందుకు నిర్ణయం తీసుకుని ఆర్జీయూకేటీ నిర్ణీత మొత్తంలో రూ.75లక్షలను నూజివీడు మున్సిపాల్టీకి చెల్లించి దాదాపు 8 ఏళ్లయినా పైప్‌లైన్ నిర్మాణానికి అడుగులు పడలేదు. ఫలితంగా నూజివీడు పట్టణంలోని గొడుగువారిగూడెం, గాంధీ నగర్ ప్రాంతాలు ప్రతి ఏటా ముంపుకు గురయ్యేవి. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పైప్‌లైన్ నిర్మాణం శరవేగంగా సాగుతోంది. నిర్మాణం పూర్తయితే నూజివీడు పట్టణాన్ని పట్టిపీడిస్తున్న ట్రిపుల్ ఐటీ మురుగునీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

ఫోన్లు తీసుకెళ్లండి

ఐసీడీఎస్ అధికారుల ఆదేశాలు

ముదినేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పని చేయని ప్రభుత్వ సెల్‌ఫోన్లు తమకెందుకంటూ ఐసీడీఎస్ అధికారులకు ఇచ్చేసిన అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు తిరిగి వెనక్కి తీసుకెళ్లాలని ఉన్నతాధికారుల నుంచి పిలుపు వచ్చింది. ఆ ఫోన్లలో ఒక్క యాప్ కూడా సక్రమంగా పని చేయటం లేదని, వాటిని వినియోగించి అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించిన వివరాలు నమోదు చేయటంలో ఇబ్బందులు పడుతున్నట్లు ఫోన్లను సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు తమ ప్రాజెక్టు అధికారులకు తిరిగి ఇచ్చేశారు. దీనిపై మంగళవారం ఆ ఫోన్లను కేంద్రాల కార్యకర్తలకు ఇచ్చేయాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారని ఐసీడీఎస్ కైకలూరు ప్రాజెక్టు సీడీపీవో దీప్తి తెలిపారు. అధికారులు ఆదేశాల మేరకు ఫోన్లను తిరిగి అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఇచ్చేస్తున్నట్లు తెలిపారు.

చాట్రాయి ఎంఈవో-1గా శ్రీను



చాట్రాయి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి ఎంఈవో-1గా ఎం. శ్రీను మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఏలూరు పట్టణ పరిధిలోని కోటదిబ్బ ప్రభుత్వ హైస్కూల్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఎఫ్ఏసీపై ఇక్కడ నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండలంలో సర్కార్ విద్యావ్యవస్థను అభివృద్ధి చేయటానికి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటానికి కృషి చేస్తానని అన్నారు. ఎంఈవో-1గా బాధ్యతలు చేపట్టిన శ్రీనును, ఎంఈవో-2 వీఎస్‌వీ బ్రహ్మాచారి, మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు కలిసి అభినందించారు.

ముసునూరు ఎంఈవో-1గా సుభాషిణి



ముసునూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ఎంఈవో-1గా పి.సుభాషిణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దెందులూరు మండలం గోపన్నపాలెం జడ్పీ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఈమెను జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ముసునూరు ఎంఈవో-1గా నియమించారు. ఆమెను యూటీఎఫ్, ఎస్టీయూ, డీపీఆర్‌టీయూ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా సుభాషిణి మాట్లాడుతూ మండలాన్ని విద్యాపరంగా అభివృద్ధి బాటలో నడిపించడానికి కృషి చేస్తానని తెలిపారు.

కన్నడ భాషపై శిక్షణకు ఉపాధ్యాయిని సాయిలక్ష్మి ఎంపిక



ముదినేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మైసూర్ సదరన్ రీజినల్ లాంగ్వేజ్ సెంటర్ నిర్వహిస్తున్న సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్‌లో కన్నడ భాషపై శిక్షణ పొందేందుకు ముదినేపల్లి మండలం రంగాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని ముందూరు సాయి లక్ష్మికి అవకాశం లభించింది. ఈ ఇనిస్టిట్యూట్‌లో కన్నడ భాషపై 10 నెలల డిప్లొమో కోర్సులో శిక్షణ పొందేందుకు ఆమెను ఎంపిక చేస్తూ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఇనిస్టిట్యూట్‌లో శిక్షణకు ఇటీవల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వా నించగా సాయిలక్ష్మి కన్నడ భాషలో శిక్షణకు దరఖాస్తు చేశారు. ఆమె సర్వీసు, వివిధ శిక్షణలు పొందిన అంశాలను పరిగణలోకి తీసుకున్న ఇనిస్టిట్యూట్ అధికార్లు ఆమెను ఎంపిక చేశారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ చదువుతున్న ఒక విద్యార్థి సబ్జెక్టులు ఫెయిల్ కావడతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో 42 రోజుల నుంచి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. చింతలపూడి మండలం తిమ్మరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఆట్రు మహేశ్వరరావు, రజని దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడైన ఆట్రు ప్రేమ్ సాయి(18) పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని సబ్జెట్లు ఫెయిల్ కావడంతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభు త్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ ఘటనపై చింతలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

రెండు కార్లు ఢీ.. తప్పిన ముప్పు

కైకలూరు, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పామర్రు-దిగమర్రు జాతీయ రహదారిలో కైకలూరు మండలం ఆలపాడు వద్ద రెండు కార్లు ఢీకొన్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున కొంత మేరకు రహదారి అభివృద్ధి పనులు చేసి వదిలి వేయడంతో కైకలూరు నుంచి ఆకివీడుకు వేగంగా వెళ్తున్న కారు రహదారి గోతుల్లో పడి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొంది. దీంతో రెండు కార్ల ముందుభాగాలు నుజ్జునుజ్జయ్యాయి. కారులో ప్రయా ణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. రహదారి నిర్మాణ పనుల్లో హెచ్చరిక బోర్డులు లేకపోవడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహిళ అదృశ్యం

ముదినేపల్లి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరు గ్రామానికి చెందిన సిహెచ్.వెంకన్నబాబు, అతని భార్య దుర్గాభవాని వణుదుర్రులో చేపల చెరువుపై పని చేస్తున్నారు. భార్య కోరిక మేరకు ఈ నెల 3న ఆమెను గ్రామంలోని ఆమె స్నేహితురాలి ఇంటి వద్ద దింపాడు. సాయంత్రం తీసుకువచ్చేందుకు వెంకన్న బాబు వెళ్లగా, భార్య స్నేహితురాలి ఇంటి వద్ద లేదు. మీ ఇంటికి వచ్చేసింది కదా అని ఆమె స్నేహితురాలు చెప్పడంతో రెండు రోజులుగా వెదికినా ఆచూకీ తెలియకపోవటంతో సోమవారం రాత్రి వెంకన్నబాబు ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ వీరభద్రరావు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.